thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 132| జగిత్యాల | శుక్రవారం 14 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## భారత్‌తో టెస్ట్‌కు శ్రీలంక జట్టు ప్రకటన



11

## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు




- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు

4

అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది.

## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



4

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణలో ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఈ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు తీవ్ర కుట్రలు చేస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో అందించిన ఈ రిజర్వేషన్లను రద్దు చేయాలంటూ కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టుల మెట్లెక్కారని మండిపడ్డారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో నిలబడి మైనార్టీల సంక్షేమాన్ని అమలు చేస్తోందన్నారు. హైదరాబాద్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన ःమైనార్టీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ः (మైనార్టీల ప్రతిభా సదస్సు)కు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో కలసి పలు రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన మైనార్టీ ప్రముఖులకు సీఎం అవార్డులను ప్రదానం చేశారు.

2





## వాళ్ల పదేళ్ల పాలన.. మా రెండేళ్ల పాలనను

# బేరీజు వేయండి

- గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేశాం
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు.. చేసిన చేతబడి వారికే తిరగబడుతుంది
- హైదరాబాద్ పేదల కోసం తొలి విడతలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు
- కూకట్‌పల్లి అభివృద్ధికి నిధుల కొరత రానివ్వం
- 22-ఏ భూముల సమస్య పరిష్కారానికి నాదీ పూచీ
- సీఎం రేవంత్‌రెడ్డి

2

పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. గతంలో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, వాటిని మరింత పెంచి రెట్టింపు స్థాయిలో పేదలకు అందిస్తున్నామని చెప్పారు. కేపీహెచ్‌బీ కాలనీ సీయూఆర్ (జఖ=) పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సోదరుడిగా అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారు. గతంలో డబ్బా ఇళ్లు వద్దంటూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ నాయకులు మోసం చేశారని, కానీ తమ ప్రభుత్వం పట్టణ పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా మొదటి విడతలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అలాగే కూకట్‌పల్లి నియోజకవర్గంలో 22-ఏ (22=ూ) నిషేధిత భూముల జాబితా వల్ల ఇబ్బంది పడుతున్న వారి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. బాధితులు కొనుగోలు చేసిన భూములకు సబ్-నంబర్లు ఇచ్చి, వాటిని వారికి సొంతమయ్యేలా చూసే పూచీ తనదేనని భరోసా ఇచ్చారు.

*- హైదరాబాద్, ఆగస్టు 13*

## అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు

ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు

మాజీ స్పీకర్ పోచారం హాట్ కామెంట్స్



3

## ఆర్‌కేవీవైపై అమలులో

# తెలంగాణ భేష్

### రాష్ట్ర ప్రగతిని ప్రశంసించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

- రెండో విడత నిధులు త్వరగా విడుదల చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- ఎల్‌నినో పరిస్థితుల్లో పప్పుధాన్యాలను వందశాతం కొనుగోలు చేయాలని వినతి
- మొక్కజొన్న సహా ఇతర పంటల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరిన తుమ్మల
- రైతు క్షేత్ర పాఠశాల యాప్ అమలు తీరుపైనా కేంద్రం ప్రశంసలు

.. వివరాలు 2లో



## నల్సార్ విద్యార్థులకు బార్ కౌన్సిల్ షాక్

- ప్రధాన న్యాయమూర్తిని స్నాతకోత్సవానికి ఆహ్వానించడంపై విద్యార్థుల అభ్యంతరం
- 2026 బ్యాచ్ విద్యార్థుల నమోదును నిలిపివేయాలని ఆదేశం
- తదుపరి ఉత్తర్వుల వరకు న్యాయవాదులుగా నమోదు చేయొద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు స్పష్టీకరణ
- నిరసనకు నేతృత్వం వహించిన విద్యార్థుల వివరాలు కోరిన బీసీఐ

2




## నిర్మాత కారు బీభత్సం

## మహిళకు గాయాలు



- డ్రైవర్‌పై అబిడ్స్ పోలీసుల కేసు
- వైద్య ఖర్చులపై నిర్మాతను సంప్రదించిన కుటుంబం
- నిర్లక్ష్యంగా స్పందించారని బాధితుల ఆరోపణ
- ప్రమాదంపై కొనసాగుతున్న దర్యాప్తు

2

## వేలం వెర్రిగా ప్రభుత్వ భూముల అమ్మకం

- రాయదుర్గం హెరిటేజ్ భూముల వేలం వెంటనే ఆపాలి
- వివాదాలు తేలకముందే అమ్మకాలకు ఎందుకింత తొందర?
- ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలో మరో మాటనా?
- సీఎంకు హరీశ్‌రావు లేఖ

3





## త్వరలో కోల్ ఎక్ఛేంజ్ ఏర్పాటు

3

- దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై..

# హైకోర్టులో వాదనలు

- స్పీకర్ తీర్పును సవాలు చేస్తూ పిటిషన్లు
- 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ విచారణ
- స్పీకర్ పరిధి దాటారని పిటిషనర్ల వాదన
- వార్తా కథనాలే ఆధారం కాదని కోర్టుకు వివరణ
- తదుపరి విచారణ ఈ నెల 17న

.. వివరాలు 2లో






# నల్సార్ విద్యార్థులకు బార్ కౌన్సిల్ షాక్

**ప్రధాన న్యాయమూర్తిని స్నాతకోత్సవానికి ఆహ్వానించడంపై విద్యార్థుల అభ్యంతరం**

**2026 బ్యాచ్ విద్యార్థుల నమోదును నిలిపివేయాలని ఆదేశం**

**తదుపరి ఉత్తర్వుల వరకు న్యాయవాదులుగా నమోదు చేయొద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు స్పష్టీకరణ**

**నిరసనకు నేతృత్వం వహించిన విద్యార్థుల వివరాలు కోరిన బీసీఐ**

**హైదరాబాద్, ఆగస్టు 13:** హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ విద్యార్థుల విషయంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. నల్సార్ నుంచి 2026లో న్యాయ పట్టా పొందిన విద్యార్థులను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు న్యాయవాదులుగా నమోదు చేయవద్దని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లను ఆదేశించింది. నల్సార్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై కొందరు విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడం వివాదానికి దారితీసింది. 2026లో పట్టా పొందనున్న విద్యార్థులతోపాటు ఇతర బ్యాచ్‌లకు చెందిన కొందరు విద్యార్థులు కూడా ఈ అభ్యంతరాలకు మద్దతు తెలిపినట్లు సమాచారం. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలోనే విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా.. నల్సార్ నుంచి 2026లో న్యాయ పట్టా పొందిన విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల నిరసన వెనుక ప్రధానంగా ఎవరు ఉన్నారు, ప్రచారాన్ని ఎవరు ప్రారంభించారు, ఎవరు సమన్వయం చేశారన్న అంశాలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని నల్సార్ విశ్వవిద్యాలయాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోరింది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై.. హైకోర్టులో వాదనలు

**స్పీకర్ తీర్పును సవాలు చేస్తూ పిటిషన్లు**

**10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ విచారణ**

**స్పీకర్ పరిధి దాటారని పిటిషనర్ల వాదన**

**వార్తా కథనాలే ఆధారం కాదని కోర్టుకు వివరణ**

**తదుపరి విచారణ ఈ నెల 17న**

**హైదరాబాద్, ఆగస్టు 13:** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం నిర్ణయం తీసుకునే సమయంలో స్పీకర్ చట్టంలో లేని అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదించారు. ప్రభుత్వ స్థిరత్వం, అసెంబ్లీలో పార్టీల బలం, ప్రతిపక్షానికి ఉన్న మద్దతు వంటి అంశాలను పరిశీలించడం స్పీకర్ పరిధిలోకి రాదని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఉద్దేశం కేవలం అసెంబ్లీలో రాజకీయ సమీకరణాలను నిర్వహించడం కాదని న్యాయవాది తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును పార్టీ ఫిరాయింపుల ద్వారా నిర్వీర్యం కాకుండా చూడటమే దాని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని స్పీకర్ తీర్పులో పరిగణనలోకి తీసుకోలేదని వాదించారు. అనర్హత పిటిషన్లలో కేవలం వార్తా కథనాలనే ఆధారంగా చూపలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు స్పష్టం చేశారు. ఎన్నికల గెజిట్లు, అధికారిక పత్రాలు, ఫారం-26 అఫిడవిట్లను సాక్ష్యాలుగా సమర్పించినట్లు తెలిపారు. వార్తా కథనాల మూలాలు, రిపోర్టర్లు, ఎడిటర్ల వివరాలు లేవన్న కారణంతో పిటిషన్లను తిరస్కరించడం సరికాదని కోర్టుకు వివరించారు.

**10 మంది ఎమ్మెల్యేల వ్యవహారం**

కాలె యాదయ్య, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టి.ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకట్‌రావు, గూడెం మహిపాల్‌రెడ్డి, సంజయ్‌కుమార్‌లపై అనర్హత వేటు కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీరిపై ఫిరాయింపు ఆరోపణలు ఉన్నప్పటికీ అధికారికంగా పార్టీ మారలేదన్న స్పీకర్ నిర్ణయాన్ని పిటిషనర్లు సవాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్, పల్లె రాజేశ్వర్‌రెడ్డితో పాటు బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ కొనసాగుతోంది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.



# వాళ్ల పదేళ్ల పాలన.. మా రెండేళ్ల పాలనను బేరీజు వేయండి

- గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేశాం
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు.. చేసిన చేతబడి వారికే తిరగబడుతుంది
- హైదరాబాద్ పేదల కోసం తొలి విడతలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు
- కూకట్‌పల్లి అభివృద్ధికి నిధుల కొరత రానివ్వం
- 22-ఏ భూముల సమస్య పరిష్కారానికి నాదీ పూచీ
- సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 13:** పదేళ్ల బీఆర్ఎస్ పాలనను, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలను కొనసాగిస్తూనే సంక్షేమాన్ని మరింత విస్తరించామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు చెల్లిస్తూనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం తమ ప్రభుత్వానికి వచ్చిందని రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. తొలి విడతలో నగరంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. "డబ్బా ఇళ్లు వద్దు.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పినవారు మీలో ఎంతమందికి ఇళ్లు ఇచ్చారో చెప్పాలి. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా అండగా ఉంటా" అని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కొందరు కుట్రలు చేశారని ఆరోపించారు. "చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి తయారైంది. అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడుతుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుండాలన్నదే. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు ప్రజల కోసం పనిచేయకుండా చేతబడులు చేయిస్తారా?" అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని సీఎం చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.12 వేల కోట్లు చెల్లించామని, స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు అందించామని, మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చామని వివరించారు. తెలంగాణలో 3.28 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. కూకట్‌పల్లి ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాను పార్లమెంట్‌కు పోటీ చేసినప్పుడు కూకట్‌పల్లి ప్రజలు ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని, ఇప్పుడు అన్ని అధికారాలు ఉన్నాయని చెప్పారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును ఆదేశిస్తున్నట్లు తెలిపారు. 22-ఏ భూముల సమస్యపైనా సీఎం స్పందించారు. ప్రజలు కొనుగోలు చేసిన భూములు పొరపాటున నిషేధిత జాబితాలో చేరితే వాటిని తిరిగి వారికి ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. ఒక సర్వే నంబర్‌లో కొంత భూమికి సమస్య ఉంటే మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదని, అవసరమైన చోట సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. "పదేళ్ల వారి పాలన.. రెండేళ్ల మా పాలనను ప్రజలే పోల్చి చూడాలి. ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చుకుంటూనే మరోవైపు సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నాం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

**కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు**

**ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి**

**మైనార్టీల ప్రతిభా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్, ఆగస్టు 13:** రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ రిజర్వేషన్లను రద్దు చేయించేందుకు కొందరు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సులో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ లౌకికవాదానికి కట్టుబడి ఉందని చెప్పారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా చూస్తుందని పేర్కొన్నారు. మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తే వాటిని రద్దు చేయాలని కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారని విమర్శించారు. కాంగ్రెస్ ఉన్నంతకాలం దేశంలోని లౌకికవాద వర్గాల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 నియామకాలు సక్రమంగా నిర్వహించలేకపోయారని సీఎం విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి విద్యావంతులు, అనుభవజ్ఞులను నియమించామని చెప్పారు. న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి గ్రూప్-1తోపాటు ఇతర ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగంతోపాటు రూ.3 కోట్ల ప్రోత్సాహకం అందించామని, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని గుర్తుచేశారు. మైనారిటీ యువత చదువుతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ అంశంపైనా సీఎం స్పందించారు. ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "గల్లీగల్లీ తిరగండి.. ఇంటింటికీ వెళ్లండి.. ప్రతి ఒక్కరి ఓటు ఉందో లేదో పరిశీలించండి. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలి" అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఆర్‌కేవీవైపై అమలులో తెలంగాణ భేష్



- రాష్ట్ర ప్రగతిని ప్రశంసించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్
- రెండో విడత నిధులు విడుదల చేయాలని తుమ్మల విజ్ఞప్తి
- ఎల్‌నినో పరిస్థితుల్లో పప్పుధాన్యాలను వందశాతం కొనుగోలు చేయాలని వినతి

**హైదరాబాద్, ఆగస్టు 13:** రాష్ట్రీయ కృషి వికాస్ యోజన అమలులో తెలంగాణ సాధిస్తున్న ప్రగతిని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు పురోగతిపై మూడు రాష్ట్రాలతో నిర్వహించిన వీడియో సమావేశంలో తెలంగాణ వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన అమలులో తెలంగాణ పనితీరు బాగుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు క్షేత్ర పాఠశాల యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం సమ-ర్థంగా అమలు చేస్తున్న తీరును కూడా ప్రశంసించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద తెలంగాణకు రావాల్సిన రెండో విడత నిధులను వీలైనంత త్వరగా మంజూరు చేసి విడుదల చేయాలని తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై శివరాజ్‌సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందిస్తూ నిధుల విడుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**పప్పుధాన్యాలు వందశాతం కొనాలి**

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తుమ్మల కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్‌లో ధరల ఒడిదుడుకుల నుంచి రైతులను ఆదుకునేందుకు తెలంగాణలో పండించే పప్పుధాన్యాలను వందశాతం కొనుగోలు చేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విజ్ఞప్తిపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

**మొక్కజొన్న కొనుగోలుపైనా ప్రత్యేక దృష్టి**

తెలంగాణలో ఉత్పత్తయ్యే మొక్కజొన్నతోపాటు ఇతర పంటల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తుమ్మల కోరారు. రైతులు తమ పంటలను విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగానే కొనుగోలు ఏర్పాట్లు చేయాలని, కేంద్ర సంస్థలతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో ముందుకు సాగుతామని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు రైతులకు గిట్టుబాటు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

# నిర్మాత కారు బీభత్సం

**మహిళకు గాయాలు**

**డ్రైవర్‌పై అబిడ్స్ పోలీసుల కేసు**

**వైద్య ఖర్చులపై నిర్మాతను సంప్రదించిన కుటుంబం**

**హైదరాబాద్, ఆగస్టు 13:** హైదరాబాద్‌లోని అబిడ్స్ పరిధిలో సినీ నిర్మాత బొమ్మకు మురళికి చెందిన కారు ప్రమాదానికి గురై ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డారు. చాపెల్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న నాంపల్లి ఆండాళమ్మ బస్తీకి చెందిన సునీతను కారు ఢీకొనడంతో ఆమె కాలికి ఫ్రాక్చర్ కావడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీఐ బ్యాంకులో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీత ఆగస్టు 12న సాయంత్రం విధులు ముగించుకుని చాపెల్ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో నిర్మాత వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న మహానంద కారును వేగంగా నడుపుతూ ఆమెను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సునీత చికిత్సకు అయ్యే ఖర్చుల కోసం ఆమె కుటుంబ సభ్యులు కారు యజమాని మురళిని ఫోన్‌లో సంప్రదించినట్లు తెలిపారు. అయితే, తమ విజ్ఞప్తికి ఆయన నిర్లక్ష్యంగా, దురుసుగా స్పందించారని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కుటుంబం ఫిర్యాదు ఆధారంగా అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణాలు, కారు నడిపిన వ్యక్తి వ్యవహారం, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.



బొమ్మకు మురళి టెక్నోక్రాట్‌గా, సామాజిక, రాజకీయ కార్యకర్తగా పనిచేసిన అనంతరం సినీ నిర్మాతగా మారారు.

# అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు



- ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు
- పోచారం మరోమారు హాట్ కామెంట్స్

**కామారెడ్డి, ఆగస్ట్ 13:** అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌కి మద్దతు ఇచ్చానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అన్నం పెట్టిన వాళ్లను మరిచిపోతే పుట్టగతులుండవన్నారు. కేసీఆర్ చేశారు కాబట్టే.. చేశారని చెప్పానని.. రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతానని తెలిపారు. ఉన్నది ఉన్నట్లు చెప్పడం తన నైజమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు. దానికి కొనసాగింపుగా గురువారం కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం' అని స్పష్టం చేశారు. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయనని స్పష్టం చేశారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తానన్నారు. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలని.. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేమని పోచారం శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

# వేలం వెర్రిగా భూముల అమ్మకం

- ప్రభుత్వ భూముల జాడలేకుండా మాయం
- రాయదుర్గం భూ వేలాన్ని వెంటనే ఆపాలి
- సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ





హైదరాబాద్, ఆగస్ట్ 13: రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణను దోచుకోవడంలో బీఆర్ఎస్‌తో పోటీ

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపీ రఘునందన్ రావు
- యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణెనికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా–ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

# బీసీ మహిళలకు స్వయం ఉపాధి

## ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, ఆగస్ట్ 13:** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్దిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్దిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.



# త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

## దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 13 :** దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# అంత్యక్రియలకు వచ్చి..

## చెరువులో దిగి ఇద్దరు మృత్యువాత

**సంగారెడ్డి, ఆగస్ట్ 13:** జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. జిన్నారం మండలం వావిలాల గ్రామంలో చెరువులో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వచ్చిన గణెళిష్ (30), మునిరాజు (58) ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఇద్దరూ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గణెళిష్‌కు ఒక్కసారిగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. చెరువులో మునిగిపోతున్న గణెళిష్‌ను గమనించిన మునిరాజు.. కాపాడేందుకు వెంటనే నీటిలోకి వెళ్లాడు. అయితే గణెళిష్‌ను రక్షించే ప్రయత్నంలో మునిరాజు కూడా నీటిలో మునిగిపోయాడు. ఇద్దరూ చాలాసేపు బయటకు రాకపోవడంతో అక్కడ ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందడంతో స్థానికులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీసినట్లు సమాచారం. అంత్యక్రియలకు హాజరైన కుటుంబాల్లో ఈ ఘటన మరో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పు తీర్చనందుకు బాలికను తీసుకెళ్లే యత్నం

## కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల కేసు

**హైదరాబాద్, ఆగస్ట్ 13:** హైదరాబాద్‌లో బాకీ తీర్చలేదని రెండేళ్ల బాలికను కిడ్నాప్‌నకు ఓ వ్యక్తి యత్నించాడు. అప్పు తీర్చలేదనే కోపంతో బాలికను తీసుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. అయితే బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. హనుమాన్ నగర్‌లో అద్దె ఇంట్లో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. మానికేశ్వరీ నగర్‌లో నివాసం ఉన్న సమయంలో పరిచయస్తుడి వద్ద రూ.30 వేల అప్పును బాలిక కుటుంబ సభ్యులు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లించకపోవడంతో బుధవారం ఇంటికి ఆ వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతో సదరు వ్యక్తి వాగ్వాదానికి దిగాడు. డబ్బులు ఇచ్చే వరకు మీ కుమార్తెను తీసుకెళ్తానంటూ అతడు బెదిరించాడు. రెండేళ్ల బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై బాధిత కుటుంబం పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# టెస్సరాక్ట్ సంస్థకు భూకేటాయింపులపై రాజకీయం

## భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపాటు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** టెస్సరాక్ట్ సంస్థకు కేటాయించిన భూములపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. 'ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో బీఆర్ఎస్ హయాంలో 54 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. వారి హయాంలో ఎకరాకు రూ.30లక్షల నుంచి రూ.80లక్షల చొప్పున ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చాక 8 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. ఎకరా రూ.1.50 కోట్లకు కేటాయించాం. 5 ఎకరాలు కావాలని టెస్సరాక్ట్ సంస్థ 2024లో దరఖాస్తు చేసుకుంది. ఏడాదిపాటు పరిశీలించి ఆ సంస్థకు 2025లో భూమిని కేటాయించాం. అందరికీ కేటాయించినట్టుగానే ఆ సంస్థకు కూడా ఎకరా రూ.1.50 కోట్ల చొప్పున ఇచ్చాం. 2025 వరకు టెస్సరాక్ట్ సంస్థకు కొండల్‌రెడ్డి డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్ కాదని ఎంపీ చామల వివరించారు.

# వివాహేతర సంబంధంతో హత్య

## భార్యను హత్య చేసిన భర్త

**నాగర్‌కర్నూల్, ఆగస్ట్ 13:** నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం కోట్ర గ్రామానికి చెందిన వివాహిత దారుణ హత్యకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోట్ర గ్రామానికి చెందిన నారుమళ్ల అనూష(22) కల్వకుర్తి పట్టణంలోని ఓ లేడీస్ కార్నర్‌లో పనిచేస్తోంది. ఆమె భర్త చెన్నయ్య ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. అనూష గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తితో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి రాములు.. అనూషను ఒడ్డోనిరాళ్ల వద్దకు తీసుకెళ్లి హత్య చేసి, ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించి దహనం చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హత్యకు పాల్పడిన రాములుతోపాటు అతనికి సహకరించిన మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కల్వకుర్తి, వెల్దండ సీఐలు భీమ్‌కుమార్, రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

## సంపాదకీయం



# పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు!

### 19 రోజులూ రభసే.. ప్రజా సమస్యలకు చోటేది?

**అధికార-ప్రతిపక్షాల పంతాలతో తుడిచిపెట్టుకుపోయిన సభా సమయం**

**చర్చకు సిద్ధమన్న ప్రభుత్వం.. అమిత్ షా ప్రసంగం వినబోమన్న విపక్షం**

**సభలను వృథా చేసే సభ్యుల జీతభత్యాలు కోత పెట్టాలన్న డిమాండ్**

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మట్టికరవడానికి అధికార, ప్రతిపక్షాలు రెండూ బాధ్యత వహించాల్సిందే. ప్రజలు ఎంతో నమ్మకంతో ఎన్నుకుని పంపిన ప్రజాప్రతినిధులు చట్టసభలను వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలకు వేదికగా మార్చడం ప్రజాస్వామ్యానికే అవమానం. సమస్యలను చర్చించి పరిష్కారాలు కనుగొనాల్సిన అత్యున్నత చట్టసభ 19 రోజుల పాటు నినాదాలు, నిరసనలు, పరస్పర ఆరోపణలతోనే గడిచిపోవడం బాధాకరం. చట్టసభల్లో ప్రజల సమస్యలు చర్చించాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించి సమాధానాలు రాబట్టాలి. అవసరమైన చట్టాలు చేయాలి. ప్రజలకు మేలు చేసే విధానాలపై లోతైన చర్చ జరగాలి. కానీ ఈ సమావేశాల్లో అవేవీ ఆశించిన స్థాయిలో జరగలేదు. ప్రతిపక్షాలు ఆందోళనలతో సభను అడ్డుకుంటే.. సభను సజావుగా నడిపించేందుకు అధికార పక్షం కూడా అవసరమైన రాజకీయ చొరవ చూపలేకపోయింది. చివరకు 'దొందూ దొందే' అన్నట్లుగా పరిస్థితి తయారైంది. జులై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాల్లో వరుసగా 19 రోజుల పాటు సభా కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. చివరి రోజు కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అధికార, ప్రతిపక్షాలు ఎవరి పట్టును వారు వీడకపోవడంతో విలువైన సభా సమయం వృథా అయింది. విద్యార్థుల ఆందోళనలపై చర్చకు సిద్ధమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడం, అవసరమైతే సమావేశాలను పొడిగించేందుకు కూడా సిద్ధమని ప్రభుత్వం చెప్పడం చివరి దశలో కీలక పరిణామంగా మారింది. ప్రతిపక్షాలతో సంప్రదించి చర్చకు సమయం కేటాయించాలని అమిత్ షా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ కూడా రాశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తానని, మొత్తం చర్చలో తాను పాల్గొంటానని ప్రకటించారు. అయితే అమిత్ షా ఉపన్యాసం వినడానికి తాము సిద్ధంగా లేమని ప్రతిపక్షం తేల్చిచెప్పింది. విద్యార్థులపై పెల్లెట్ గన్‌ల వినియోగానికి ఎవరు ఆదేశించారో ముందుగా సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ పట్టుబట్టారు. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం వెనక్కి తగ్గడం చూస్తున్నామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. మరోవైపు ప్రభుత్వ ప్రతిపాదన అసలు సమస్య నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమేనని విపక్షం ఎదురుదాడి చేసింది. ఇలా ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ జరగాల్సిన సభ రాజకీయ బలప్రదర్శనకు వేదికగా మారింది. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ పోడియం వైపు వెళ్లడం, స్పీకర్ వారించడం నిత్యకృత్యంగా మారితే.. అధికార పార్టీ సభ్యులు సైతం మకరద్వారం వద్ద ప్రతిపక్షాన్ని నిలదీస్తూ నినాదాలకు దిగారు. సభ లోపలా, బయటా పోటాపోటీ నిరసనలే కనిపించాయి. ప్రతిపక్షం బలంగా గళం వినిపించడం ప్రజాస్వామ్యానికి అవసరమే. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కూడా దాని బాధ్యతే. కానీ నిరసనే అంతిమ లక్ష్యంగా మారి సభా కార్యకలాపాలే జరగకుండా పోతే చివరకు నష్టపోయేది ప్రజలే. అదే విధంగా ప్రతిపక్షాన్ని తప్పుబట్టడంతో సరిపెట్టకుండా సభను నడిపించే బాధ్యత అధికార పక్షంపైనా ఉంటుంది. అందుకే ఈ వైఫల్యానికి ఒక పక్షాన్నే బాధ్యులను చేయడం సరికాదు. ప్రజలు తమ నియోజకవర్గ సమస్యలను సభలో వినిపిస్తారని, దేశాన్ని వేధిస్తున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్య, వైద్యం, రైతాంగం, ఆర్థిక సమస్యలపై తమ ఎంపీలు ప్రశ్నిస్తారని ఆశిస్తారు. కానీ కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాల్సిన పార్లమెంట్ రాజకీయ పంతాలకు బలైతే ప్రజాస్వామ్య వ్యవస్థలపైనే నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉంటుంది. ఇకనైనా ప్రజలు కూడా తమ ప్రతినిధుల పనితీరును ప్రశ్నించాలి. ముఖ్యంగా కొత్తతరం యువత సభల్లో ఎవరు ఏం మాట్లాడుతున్నారు? ప్రజా సమస్యలపై ఎవరు నిలబడుతున్నారు? ఎవరు కేవలం రాజకీయ ప్రదర్శనకే పరిమితమవుతున్నారు? అన్నది గమనించాలి. సభలను ఉద్దేశపూర్వకంగా స్తంభింపజేసి ప్రజాధనాన్ని వృథా చేసే సభ్యుల విషయంలో జవాబుదారీతనం తీసుకురావాలన్న చర్చ కూడా జరగాలి. సభా సమయాన్ని నిరంతరం వృథా చేసే సందర్భాల్లో జీతభత్యాల కోత వంటి చర్యలకు స్పష్టమైన నిబంధనలు ఉండాలా అన్నదానిపై దేశవ్యాప్తంగా చర్చ అవసరం. ఎందుకంటే పార్లమెంట్ ఎవరి వ్యక్తిగత రాజకీయ వేదిక కాదు. అది ప్రజల గొంతు. ఆ గొంతునే నినాదాల హోరులో మూగబోయేలా చేస్తే.. చివరకు అవమానించబడేది పార్లమెంట్ కాదు.. దాని వెనుక నిలిచిన భారత ప్రజలే!

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ‌ఃూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా**



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యవతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

**ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. అల్‌ఖైదా తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు పాక్ అండ

**పాక్‌వైపు కన్నెత్తితో భారత్ సర్వనాశనం తప్పదు**

**అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రేలాపన**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హాఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

# సొరంగంలో నీరు, మట్టి, 10 మంది గల్లంతు

**సొరంగంలో చిక్కుకున్న 18 మంది కార్మికులు**

**ఎనిమిది మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన సహాయక బృందాలు**

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సొరంగంలోకి ఒక్కసారిగా భారీగా నీరు, మట్టి, రాళ్లు దూసుకురావడంతో 18 మంది కార్మికులు చిక్కుకుపోయారు. వీరిలో ఎనిమిది మందిని సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీసుకురాగా, మరో 10 మంది ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. చమోలి జిల్లాలోని పీపల్‌కోటి వద్ద టెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్టు సొరంగంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కార్మికులు పనుల్లో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా భారీగా నీరు సొరంగంలోకి ప్రవేశించింది. నీటి ఉద్ధృతికి కొందరు కార్మికులు ప్రవేశద్వారం వైపు కొట్టుకురాగా, మరికొందరు లోపలే చిక్కుకుపోయినట్లు అధికారులు భావిస్తున్నారు. నీటితోపాటు పెద్దఎత్తున మట్టి, రాళ్లు సొరంగంలోకి చేరడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. గల్లంతైన 10 మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు జాతీయ విపత్తు నిర్వహణ దళం, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం బృందాలు రంగంలోకి దిగాయి. సొరంగంలోకి చేరేందుకు ఉన్న మార్గాలను పరిశీలిస్తూ సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నాయి.

# బాల్య వివాహ రహిత జిల్లాగా నారాయణపేటను తీర్చిదిద్దాలి

- బాల్య వివాహాల నివారణలో మత పెద్దల పాత్ర కీలకం
- బాల్య వివాహాలకు సహకరించకుండా స్పష్టంగా 'నో' చెప్పాలి.
- సమాచారం అందిస్తే తక్షణ చర్యలు.
- జిల్లా కలెక్టర్ ప్రియాంక.






**నారాయణపేట, ఆగస్టు,13:** నారాయణపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. శ్రావణ మాసంలో వివాహ ముహూర్తాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పూజారులు, పాస్టర్లు, ఖ్వాజీలకు బాల్య వివాహాల నిర్మూలనపై ఇక్కడి సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహం ఒక సామాజిక రుగ్మత మాత్రమే కాకుండా చట్టవిరుద్ధమైన చర్య అని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండని బాలికకు వివాహం చేయడం వల్ల ఆమె విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు.

### మత పెద్దల పాత్ర కీలకం

పూజారులు, మౌలానాలు, పాస్టర్లు, ఖాజీలు వివాహ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారని, సమాజంలో వారి మాటకు ఎంతో గౌరవం, విశ్వాసం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. బాల్య వివాహం నిర్వహించేందుకు ఎవరైనా సంప్రదించినప్పుడు, వివాహానికి అనుమతి ఇవ్వకుండా "ఇది సరైన వయసు కాదు.. వివాహాన్ని వాయిదా వేయండి" అని స్పష్టంగా చెప్పాలని కోరారు.తమ పరిధిలో బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని మత పెద్దలకు సూచించారు.

### చట్టంపై విస్తృత అవగాహన

జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే సర్పంచులు, చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.మక్తల్, కొడంగల్, కోస్గి తదితర ప్రాంతాల్లో కూడా బాల్య వివాహాల నివారణపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### కారణాలు చూపడం సమర్థనీయం కాదు

కుటుంబ ఒత్తిడి, ప్రేమ వ్యవహారం, సామాజిక పరిస్థితులు తదితర కారణాలను బాల్య వివాహాలకు చూపుతున్నప్పటికీ, ఏ కారణం కూడా చట్టాన్ని ఉల్లంఘించడానికి సమర్థన కాదని కలెక్టర్ స్పష్టం చేశారు.బాల్య వివాహాల వల్ల బాలికలు చిన్న వయసులోనే గర్భధారణ, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. చదువు మధ్యలోనే ఆగిపోయి భవిష్యత్తులో విద్య, ఉపాధి అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.ఇటీవల కోటకొండ పీహెచ్‌సీ సందర్శన సందర్భంగా కవలలకు గర్భవతిగా ఉన్న యువతిని గుర్తించి, తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న ఆమెకు వెంటనే వైద్య సేవలు అందించి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించిన విషయాన్ని కలెక్టర్ ప్రస్తావించారు.బాలికలకు చిన్న వయసులో వివాహం చేయడం వల్ల వారి విద్య, ఉపాధి, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని కలెక్టర్ అన్నారు."ఒక బాలికకు బాల్యం కావాలి.. చదువు కావాలి.. ఆరోగ్యం కావాలి.. తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే అవకాశం కావాలి" అని పేర్కొన్నారు.బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.సమాచారం అందిస్తే తక్షణ చర్యలు జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత తహసీల్దార్, సీడీపీఓ లేదా చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు.వయస్సు ధృవీకరణ పత్రాలు, ఆధార్ తదితర వివరాలపై అనుమానాలు ఉన్నప్పుడు వెంటనే అధికారులను సంప్రదించాలని తెలిపారు.బాల్య వివాహాల విషయంలో ఎవరైనా ఒత్తిడి తీసుకువచ్చినా, ఎలాంటి రాజకీయ లేదా ఇతర జోక్యాలకు తలొగ్గకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.శ్రావణ మాసంలో జిల్లాలో జరిగే వివాహాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, సీడీపీఓల ద్వారా వివాహాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, అనుమానాస్పద సందర్భాల్లో తక్షణమే పరిశీలన చేపట్టాలని ఆదేశించారు.రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రతినిధులతో మరోసారి సమావేశం నిర్వహించి బాల్య వివాహాల నివారణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించనున్నట్లు తెలిపారు."బాల్య వివాహాలకు స్వస్తి – బాలికల భవిష్యత్తుకు భరోసా – బాల్య వివాహ రహిత నారాయణపేట జిల్లా" అనే లక్ష్యంతో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

### బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు సహకరించాలి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్.

నారాయణపేట జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు పూజారులు, పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, మత పెద్దలు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పిలుపునిచ్చారు.వివాహం ఒక పవిత్రమైన కార్యక్రమమని, అయితే బాల్య వివాహం మాత్రం చట్టవిరుద్ధమైనదని స్పష్టం చేశారు. కాలానుగుణంగా సమాజంలో మార్పులు వస్తున్నాయని, ప్రస్తుతం బాలల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.బాల్య వివాహాల కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోవడంతో పాటు రక్తహీనత, చిన్న వయసులో గర్భధారణ, ప్రసవ సమయంలో సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.ఒక బాలికకు 18 సంవత్సరాలు పూర్తయ్యే వరకు తల్లిదండ్రులు ఆమెకు సంరక్షకులుగా ఉండి, చదువు, ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు.వివాహ ముహూర్తం నిర్ణయించే సమయంలో జాతకం, గుణమేళనం వంటి అంశాలను ఏ విధంగా పరిశీలిస్తారో, అదే విధంగా వధూవరుల వయస్సును కూడా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని పూజారులు, పురోహితులు, మత పెద్దలను ఎస్పీ కోరారు.18 సంవత్సరాలు పూర్తికాని బాలిక వివాహానికి అంగీకరించకూడదని, వయస్సుపై అనుమానం ఉంటే వివాహాన్ని నిర్వహించకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఆధార్ లేదా ఇతర ధృవపత్రాల్లో అనుమానాస్పద వివరాలు ఉన్నా, తప్పుడు ధృవపత్రాలు సమర్పించినా వాటిని ఆధారంగా చేసుకుని వివాహం నిర్వహించకుండా పోలీస్ అధికారులు, సీడీపీఓలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.బాల్య వివాహాన్ని నిర్వహించే వ్యక్తులు కూడా చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని, బాల్య వివాహ నిషేధ చట్టంలోని నిబంధనలను ప్రతి పూజారి, పురోహితుడు, ఖాజీ, పాస్టర్, మత పెద్ద తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు.తల్లిదండ్రులు, బంధువులు లేదా ఇతరుల నుంచి బాల్య వివాహం నిర్వహించాలనే ఒత్తిడి వచ్చినప్పుడు, "18 సంవత్సరాలు పూర్తికాకుండా వివాహం నిర్వహించడం చట్టవిరుద్ధం" అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేసి, చట్టాన్ని రక్షణగా ఉపయోగించుకోవాలని సూచించారు.సమాజంలో పూజారులు, పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, మత పెద్దలకు ప్రజల్లో ప్రత్యేకమైన గౌరవం, విశ్వాసం ఉందని, వారి మాటలను ప్రజలు శ్రద్ధగా వింటారని ఎస్పీ తెలిపారు. అందువల్ల వివాహానికి వచ్చే తల్లిదండ్రులకు బాలిక విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు ప్రాధాన్యతను వివరించి, బాల్య వివాహాల నిరోధంలో వారు ముందుండాలని కోరారు."శీఘ్రమే పుత్రప్రాప్తిరస్తు" అనే దీవెనతో పాటు "విద్యా ప్రాప్తిరస్తు, ఉద్యోగ ప్రాప్తిరస్తు" అని ఆశీర్వదించాలని ఎస్పీ సూచించారు.బాలికలకు కేవలం వివాహమే జీవిత లక్ష్యంగా కాకుండా విద్య, ఉద్యోగం, స్వయం సమృద్ధి, మంచి భవిష్యత్తు లక్ష్యాలుగా ఉండేలా సమాజం ప్రోత్సహించాలన్నారు.బాల్య వివాహం జరుగుతోందని తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వయస్సుపై అనుమానం ఉన్న సందర్భాల్లో స్వయంగా నిర్ణయం తీసుకోకుండా పోలీస్ శాఖ, సీడీపీఓ లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి నారాయణపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం" అని ఎస్పీ పిలుపునిచ్చారు."బాలికకు మంచి విద్య అందాలి.. మంచి ఉద్యోగం రావాలి.. తన కాళ్లపై తాను నిలబడాలి.. అదే మనందరి ఆశీర్వాదం కావాలి" అని పేర్కొన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కు అవగాహన కల్పిస్తూ ముద్రించిన బ్రోచర్లను ఎస్పీ తో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీపీఆర్ఓ ఎం.ఏ. రషీద్, డీసీపీఓ కరిష్మా, చైల్డ్‌లైన్ తిరుపతయ్య, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గోడు వినాలి.. ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలి

- అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి... ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు.. తక్షణమే పరిష్కరించాలి
- ప్రజల సమస్యలే ప్రథమ ప్రాధాన్యం.. అధికారులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం



**వరంగల్, ఆగస్టు 13 : :** ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సూచించారు.గురువారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలపై వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, సంబంధిత అధికారులు, కాలనీ అధ్యక్షులతో కలిసి మున్సిపల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు, స్థానికులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్ల కొరత, స్మశానవాటికల వద్ద నీటి సౌకర్యం తదితర సమస్యలను వివరించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తేనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఓపికగా విని, పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు.ఈ సమావేశంలో 14వ డివిజన్ అధ్యక్షుడు ఇంతియాజ్, వివిధ కాలనీల అధ్యక్షులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగు పడి మృతి చెందిన కుటుంబానికి గ్రామ సర్పంచ్ ఆర్థిక సహాయం

**బొంరస్ పేట మండలం, ఆగస్టు,13:** వికారాబాద్ జిల్లా బొంరాస్ పేట మండల పరిధిలోని టేకులగడ్డ తండాలో పిడుగు పడి బుజ్జిబాయి అకాల మృతి చెందడంతో విషాదంలో ఉన్న మృతురాలి భర్త దీపా నాయక్,మరియు పిల్లలకు గ్రామ సర్పంచ్ లక్ష్మీ రాజు పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.5,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీ రాజు మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కుటుంబ సభ్యులకు భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.మృతురాలి కుమారుడు, కుమార్తె టేకులగడ్డ తండా పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న నేపథ్యంలో, వారి విద్యాభ్యాసానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరారం గోపాల్ ఇప్పటికే సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు దూరమైన రెవిన్యూ కార్యాలయం...

- పాత కార్యాలయ స్థలంలో నూతన భవనం నిర్మించాలి... బాల్నే జగన్
- పాత భవనం శిథిలం.. కొత్త భవనం కోసం ప్రజల ఎదురుచూపులు
- సర్టిఫికెట్ కోసం రెండు కిలోమీటర్లు...ప్రజల చెంతకు రెవిన్యూ సేవలు తీసుకురావాలి



**నర్సంపేట, ఆగస్టు 13 : :** పట్టణ నడిబొడ్డున ఉన్న పాత రెవిన్యూ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి బాల్నే జగన్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పాత రెవిన్యూ కార్యాలయ స్థలంలోనే వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం పాత రెవిన్యూ కార్యాలయం వద్ద బాల్నే జగన్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పాత భవనం ప్రమాదకరంగా మారడంతో ఏడాది క్రితం తహసీల్దార్ కార్యాలయాన్ని గ్రెయిన్ మార్కెట్‌కు తరలించారని తెలిపారు. దీంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర రెవిన్యూ సేవల కోసం ప్రజలు సుమారు రెండు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు.ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు సరైన రవాణా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయం దూరంగా ఉండటంతో ఇప్పటికీ పలువురు ప్రజలకు కార్యాలయం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నర్సంపేట పట్టణ నడిబొడ్డున అన్ని ఆధునిక సౌకర్యాలతో నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మించి, ప్రజలకు మెరుగైన రెవిన్యూ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని బాల్నే జగన్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ–మన్ కీ బాత్ కార్యదర్శి కొంపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్ లు అందజేసిన-11వార్డు కౌన్సిలర్ బత్తుల అనిత నరసింహ




**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,13:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్ఠ పరిచే దిశగా అడుగులు వేస్తున్నారు.అందులో భాగంగా గురువారం విద్యార్థులకు 11వ వార్డు కౌన్సిలర్ బత్తుల అనిత నరసింహ చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫామ్ లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, అంగన్వాడీ టీచర్, రాములమ్మ, పాల్గొన్నారు.

# కష్టకాలంలో అండగా.. ఆప్తులను పరామర్శించిన ఎమ్మెల్యే 'నాయిని'

- గాయపడిన లింగారెడ్డికి పరామర్శ.. మాతృవియోగంతో బాధలో ఉన్న యాదగిరి కుటుంబానికి సానుభూతి



**కాజీపేట, ఆగస్టు 13 : :** కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే మానవత్వానికి నిదర్శనమని చాటుతూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం కాజీపేట 62వ డివిజన్ పరిధిలోని సోమిడిలో పర్యటించి పలువురిని పరామర్శించారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు లింగారెడ్డి నివాసానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అనంతరం సోమిడి గౌడ సంఘం అధ్యక్షుడు గొల్లకొండ యాదగిరి తల్లి కౌసల్య ఇటీవల మృతి చెందడంతో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కౌసల్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, బాధలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెప్పడం తన బాధ్యతగా భావిస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చురకలు



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, పంద్రాగస్టు ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



**నిజామాబాద్, ఆగస్టు 13 :):** ఈ నెల 15న చేపట్టనున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం అధికారులతో సమీక్షించారు.నిజామాబాద్‌లోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు హాజరయ్యే నేపథ్యంలో వేదిక, సీటింగ్, పార్కింగ్, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు.అలాగే పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సంక్షేమ పథకాల స్టాళ్లు, శకటాలు ఏర్పాటు చేయడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబీకులను ఘనంగా సత్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కలతోనే సరైన అభివృద్ధి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, ఆగస్టు 13:** జనగణన–2027 సన్నాహకాల్లో భాగంగా రూపొందించే జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ అత్యంత ప్రామాణికంగా ఉండాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించిన ఆమె, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ఖచ్చితమైన జనాభా గణాంకాలు కీలకమన్నారు. గ్రామాలు, పట్టణాల వారీగా జనాభా, మౌలిక వసతులు, విద్య, వైద్యం, పౌర సౌకర్యాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



## వర్షా భావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి: కలెక్టర్ అంకిత్

**సుజాతనగర్, ఆగస్టు 13:** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పెసర,



కూరగాయలు, ఇతర ఆరుతడి పంటల వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. గురువారం సింగభూపాలెం, పాత అంజనాపురం, వేపలగడ్డ గ్రామాల్లో పర్యటించిన ఆయన పంటలు, చెరువు నీటిమట్టం, ఇందిరమ్మ ఇండ్లు, మిషన్ భగీరథ పనులు, పాఠశాలలను పరిశీలించారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి లబ్ధి అందేలా రెండో విడత సర్వేను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.49 లక్షలతో నిర్మిస్తున్న మిషన్ భగీరథ సంప్‌ను త్వరగా పూర్తి చేసి ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలని సూచించారు. పాఠశాల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచి నెల రోజుల్లో తెలుగు, ఇంగ్లీష్, గణితంలో స్పష్టమైన పురోగతి కనిపించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## కొడంగల్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు సంజీవరెడ్డి,సెక్రెటరీ బల్ రెడ్డి కి సన్మాన కార్యక్రమం

**కొడంగల్ మున్సిపల్,13:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం దగ్గర కొడంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సంజీవరెడ్డి మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీగా నియమితులైన బాల్ రెడ్డిని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నందారం, మాజీ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి,ఎం.డి యూసుఫ్, మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ రెడ్డి. యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణంరాజు, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు నయుమ్ యువజన కాంగ్రెస్ కోడంగల్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు జూనియర్,మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుండెపై చిన్న నిర్లక్ష్యం.. జీవితంపై పెద్ద ప్రభావం...

- నేడు 'గ్రీన్ స్టార్ హాస్పిటల్' లో ఉచిత గుండె వైద్య శిబిరం
- ఉచిత గుండె పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి... డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి
- నిశ్శబ్దంగా వచ్చే గుండె జబ్బులకు.. ముందస్తు పరీక్షలే రక్షణ
- గుండె జాగ్రత్త..ప్రాణం భద్రం - గుండెపై శ్రద్ధే..జీవితానికి భరోసా



**నర్సంపేట, ఆగస్టు 13 : :** మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చిన్న వయసులోనే షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు పెరుగుతున్నాయని, వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో గుండె సంబంధిత వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉందని గ్రీన్ స్టార్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.గ్రీన్ స్టార్ హాస్పిటల్ ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ, హైదరాబాద్ వారి సహకారంతో నేడు (శుక్రవారం) గ్రీన్ స్టార్ హాస్పిటల్‌లో ఉచిత కార్డియాక్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో శారీరక శ్రమ తగ్గిపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పులు, ఒత్తిడి తదితర కారణాలతో బీపీ, షుగర్, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలు చిన్న వయసులోనే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. వీటిని తొలిదశలోనే గుర్తించి వైద్యుల సూచన మేరకు తగిన చికిత్స, జీవనశైలి మార్పులు పాటించకపోతే గుండెపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు."గుండెపోటు వచ్చిన తర్వాత చికిత్స చేయించుకోవడం కంటే ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలు" అని ఆయన సూచించారు. బీపీ, షుగర్ ఉన్నవారితో పాటు కుటుంబంలో గుండె సంబంధిత వ్యాధుల చరిత్ర ఉన్నవారు, అధిక బరువు ఉన్నవారు, ధూమపానం చేసే వారు, అలాగే ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్న ప్రతి ఒక్కరూ గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో 2D ఎకోతో పాటు గుండెకు సంబంధించిన వివిధ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్యుల సలహాలు, సూచనలు అందించనున్నట్లు తెలిపారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారు ముందుగానే పరీక్షలు చేయించుకుని తగిన వైద్య సలహా పొందేలా ఈ శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.ఆగస్టు 14న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు గ్రీన్ స్టార్ హాస్పిటల్‌లో శిబిరం కొనసాగుతుందని డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బాలయ్య దశదినకర్మలో పాల్గొన్న ఉద్యమకారుల ఫోరం నాయకులు.

**వలిగొండ ఆగస్టు 13 :**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధ మల్ల బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా గురువారం ఆయన స్వగ్రామం లింగరాజు పల్లి లో దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారుల ఫోరం నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి మాట్లాడుతూ గంధమల్ల బాలయ్య ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఉద్యమకారుల ఫోరం ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చేవాడని ఆయన స్ఫూర్తితో ఉద్యమకారుల హక్కులు సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, బీసి సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి, ఉద్యమకారుల ఫోరం నాయకులు బొడిగెసుదర్శన్, ఫోరం జిల్లా నాయకులు బొడ్డుపల్లి లింగయ్య, కదిరేని స్వామి, రామన్నపేట ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు నోముల శంకర్ ,కొండూరు సత్తయ్య, నీలమ్మ, ఎదురుగట్ల యాదగిరి, పల్లెర్ల రామచందర్, సందయ్య,లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లు సత్వరమే పరిష్కరించాలి

- విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.
- యు.ఎస్.పి.సి మండల అధ్యక్షులు గౌరారం గోపాల్ డిమాండ్.

**బొంరస్ పేట మండలం, ఆగస్టు,13:**

బొంరస్ పేట మండల తాహసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఉప తహసిల్దార్ చాంద్ పాషా ను కలిసి 12 ప్రధాన డిమాండ్లతో కూడిన మెమోరాండం సమర్పించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో తదుపరి ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా యు ఎస్ పి సి నాయకులు గౌరారం గోపాల్ మాట్లాడుతూ,, రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. ప్రధాన డిమాండ్లు 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలి. పెండింగ్‌లో ఉన్న బిల్లులు, 5 డీఏలను సత్వరమే విడుదల చేయాలన్నారు.



CPS విధానాన్ని రద్దు చేసి OPS పునరుద్ధరించాలి. కేంద్ర ప్రభుత్వం మెమో నెం.57/4, 57/5 ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల తరహాలో DSC-2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు OPS పునరుద్ధరించాలి. ప్రాథమిక పాఠశాలల్లో స్టాఫ్ ప్యాటర్న్‌ను పునఃసమీక్షించి, జీవో 25 ను సవరించాలి. 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ నిబంధనలు రూపొందించాలన్నారు. ఖాళీగా ఉన్న MEO, Dy.EO, DEO, DIET లెక్చరర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి. MEO పోస్టులను అప్‌గ్రేడ్ చేసి, రాష్ట్రంలోని ఎడ్యుకేషన్ డివిజన్లను పునర్వ్యవస్థీకరించాలి. ఇతర శాఖల మాదిరిగా పాఠశాల విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖలలో జీవో 190ను అమలు చేయాలి. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. మోడల్, ఎయిడెడ్ పాఠశాలలు, అన్ని గురుకుల సొసైటీల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలి. గిరిజన సంక్షేమ శాఖలో భాషా పండిట్, PET పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న KGBV/URS సిబ్బందికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలి. DSC-2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యు ఎస్ పి సి జిల్లా, మండల నాయకులు శివరాజ్ రమేష్ బాల్రాజ్ గుంజ వెంకటయ్య మధుకర్ లక్ష్మి శంకరయ్య సోమ్లా గౌస్ ముదాసీర్ రవి రాము శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సేవా కేంద్రం ఏర్పాటు చేయాలి

- పెండింగ్ ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలి
- కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి ఎంపీ 'కడియం కావ్య' వినతి
- వైద్య సేవల కోసం వృద్ధుల అవస్థలు.. స్పందించిన ఎంపీ
- 350 కి.మీ. ప్రయాణం తప్పేలా వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



**వరంగల్, ఆగస్టు 13 : :** వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం కింద ఆరోగ్య సేవా కేంద్రం ఏర్పాటుకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను వెంటనే మంజూరు చేసి, మిగిలిన ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు.వరంగల్, పరిసర ప్రాంతాల్లో సుమారు 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ఆధారపడి ఉన్నారని ఎంపీ తెలిపారు. వరంగల్‌లో ఈ వైద్య సేవా కేంద్రం అందుబాటులో లేకపోవడంతో వైద్యం కోసం 350 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సి వస్తోందని వివరించారు. ముఖ్యంగా వృద్ధులు, పెన్షనర్లు తరచూ వైద్య సేవల కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి రావడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు.వరంగల్‌లో ఆరోగ్య సేవా కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఆర్థిక అనుమతుల కోసం పెండింగ్‌లో ఉందని డాక్టర్ కడియం కావ్య తెలిపారు. కేంద్రానికి కేటాయించనున్న భవనానికి సంబంధించిన న్యాయసమ్మత అద్దె విలువ నిర్ధారణ ఇప్పటికే పూర్తయిందని, అద్దెకు సంబంధించిన దస్త్రానికి ఆకాశవాణి ప్రధాన కార్యనిర్వహణాధికారి ఆమోదం కూడా లభించిందని వివరించారు.పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను త్వరితగతిన మంజూరు చేసి, మిగిలిన అధికారిక ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిని ఎంపీ కావ్య కోరారు. వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సేవా కేంద్రం అందుబాటులోకి వస్తే వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు స్థానికంగానే వైద్య సేవలు అందుతాయని తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగి, వృద్ధులు మరియు పెన్షనర్లకు ఎంతో ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.

## సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో నూతన కాకతీయ క్యాంటీన్ ప్రారంభం

- విద్యార్థులు, సిబ్బందికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలి... ఎమ్మెల్యే 'నాయిని'

**హనుమకొండ, ఆగస్టు 13 : :** సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాకతీయ క్యాంటీన్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా క్యాంటీన్ నిర్వాహకులు దూలం క్రాంతికుమార్ గౌడ్, సుదర్శన్లను ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తూ క్యాంటీన్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.క్యాంటీన్ అందుబాటులోకి రావడంతో కళాశాల విద్యార్థులు, సిబ్బందికి మెరుగైన ఆహార సదుపాయం లభించనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి, లా కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సుదర్శన్, పీజీ కాలేజీ ప్రిన్సిపల్ నిర్మల, నాన్-టీచింగ్ ఎన్జీవో అధ్యక్షుడు, సుబేదారి యూనిట్ రాజు నాయక్, ఆర్ట్స్ కాలేజీ టీచింగ్ ఫ్యాకల్టీ క్లబ్ చైర్మన్ డాక్టర్ భిక్షపతి, ఫ్యాకల్టీ సభ్యులు, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# కంప్యూటర్ కాంటాపై బాటు..రేషన్ బియ్యానికి కాటు!





- రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలి... పాలకుర్తి విజయ్‌కుమార్
- బాటుతో బరువు పెంచి...పేదల బియ్యం తగ్గించి.. వీధికొక 'కాంటా కాట్రాజు'...
- అధికారులు స్పందించాలి... పేదలను ఆదుకోవాలి

**వరంగల్, ఆగస్టు 13 : :** పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడుతూ, తూకంలో మోసం చేస్తున్న రేషన్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుర్తి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.కిలా వరంగల్ మండల పరిధిలోని శివనగర్ ప్రాంతంలో గురువారం సామాజిక తనిఖీ నిర్వహించిన సందర్భంగా కంట్రోల్ షాప్ నంబర్ 9లో రేషన్ బియ్యం పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యం తూకం వేసే కంప్యూటర్ కాంటాపై రెండు కిలోల బాటు ఉంచి తూకం వేస్తున్నట్లు గుర్తించామని, తద్వారా పేద వినియోగదారులకు అందాల్సిన బియ్యంలో కోత పెడుతూ మోసానికి పాల్పడుతున్నారని విజయ్‌కుమార్ ఆరోపించారు.ఈ విషయాన్ని వెంటనే కిలా వరంగల్ తహసీల్దార్, పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యంలో అక్రమాలకు తావులేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కోరారు.కిలా వరంగల్ మండలంలోని కొన్ని రేషన్ దుకాణాల్లో డీలర్లు తూకాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, కంప్యూటర్ కాంటాపై అదనపు బరువులు ఉంచి పేదలకు తక్కువ బియ్యం అందించే విధానానికి అడ్డుకట్ట వేయాలన్నారు. పేదల హక్కుగా అందాల్సిన రేషన్‌ను దోచుకోవడం సహించరాదని స్పష్టం చేశారు.వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వెంటనే స్పందించి కిలా వరంగల్ మండలంలోని రేషన్ దుకాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడినట్లు తేలిన డీలర్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పాలకుర్తి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు అందేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- కొల్లూరులో రెండో రోజు మార్నింగ్ వాక్, ఇంటింటికీ తిరిగి సమస్యలపై ఆరా



**ఆలేరు, ఆగష్టు 13::** ప్రజా పాలన ప్రగతి పాలనలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో రెండో రోజు మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకునే అవకాశం కలుగుతుందని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జనగాం సుధారాణి శ్రీపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ గాజుల దశరథ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు యాదవ్, ఆలేరు మాజీ వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్ యాదవ్, కొల్లూరు మాజీ సర్పంచులు గాజుల నర్సయ్య యాదవ్, పిల్లలమర్రి శంకరయ్య, వార్డు సభ్యులు గ్యాదపాక అరుణ లక్ష్మయ్య, బుసిగంపల అంజయ్య, అచ్చిని బిక్షపతి, ఎండీ మస్తాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి లక్ష్మయ్య, గ్రామ ఉపాధ్యక్షులు దార బాలస్వామి, గ్యాదపాక మల్లేష్, గ్యాదపాక సురేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బరపటి నర్సింగరావు, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కాన్‌రాజ్ కరుణాకర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS





**బొంరస్ పేట మండలం, ఆగస్టు,13:**
వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS గురువారం బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు విభాగాలను పరిశీలించి, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.అనంతరం నూతనంగా ఏర్పాటు అవుతున్న బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ భవనాన్ని ఎస్పీ గారు పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని, పోలీస్ సిబ్బందికి మరియు ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల పట్ల మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందన అందించాలని సూచించారు. పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా పోలీసింగ్ కొనసాగించాలని తెలిపారు.నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నాణ్యమైన దర్యాప్తుతో కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేసి, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతతో పాటు సైబర్, NDPS నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ప్రజల భద్రత, నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది సమిష్టిగా పనిచేయాలని, విధి నిర్వహణలో అప్రమత్తత, క్రమశిక్షణ, నిబద్ధతను ఎల్లప్పుడూ పాటించాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ కొండల్ రెడ్డి, బొంరాస్‌పేట్ ఎస్సై వెంకటరమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి

**జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.**



**నారాయణపేట, ఆగస్టు,13:**
ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో బోర్లు, బావుల కింద వరి సాగుకు బదులుగా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...నీటి వనరుల లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు.బోర్లు, బావులు ఉన్న రైతుల పొలాలను వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సందర్శించి, వరికి బదులుగా ఏయే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారో వివరాలను సేకరించాలని ఆదేశించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు.సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి సాయిబాబా, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, డీపీఎడీలు శాంతి నిర్మల, వ్యవసాయ అధికారులు హరిత, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,13:**
కొడంగల్ పట్టణ కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. ఆలయ పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, భక్తులకు కల్పించనున్న సౌకర్యాలపై ఆలయ నిర్వహణ లో ఇళ్లను కోల్పోయిన వారి cheque లకు సంబంధించిన విషయాలపై అధికారులతో సమీక్షించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ కడ స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి,వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ వెంకట చారి, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బస్వరాజు, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్,తహసిల్దార్ రాంబాబు, సంబంధిత అధికారులు, ఇంజనీర్లు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# వడ్డేపల్లిలో విద్యుత్తు సమస్యలపై స్పెషల్ డ్రైవ్



**రాయపోల్, ఆగస్టు 13:**
రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రేణుక రాజాగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తుక్కాపూర్ ఏడీ మధుసూదన్ హాజరై గ్రామంలో నెలకొన్న విద్యుత్తు సమస్యలను పరిశీలించారు.గ్రామంలోని విద్యుత్తు సరఫరా, స్తంభాలు, లైన్లు తదితర సమస్యలను అధికారులు పరిశీలించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎఈ శ్రీనివాస్,వార్డు మెంబర్లు రాజు,నర్సింలు,శివ,స్వామి,విద్యుత్తు శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చిన్నారులకు యూనిఫార్మ్స్ పంపిణీ



**రాయపోల్, ఆగస్టు 13:**
రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫార్మ్స్ పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ రేణుక రాజాగౌడ్ చేతుల మీదుగా చిన్నారులకు యూనిఫార్మ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ యాదమ్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి. సిఐటియు డిమాండ్.



**వలిగొండ ఆగస్టు 13 :**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వివిధ రంగాల్లో పనిచేస్తున్న మార్కెట్ అమాలీలు బజార్ అమాలీలు గ్రామీణామాలు కు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రోజున హమాలీలకు సంక్షేమ ఏర్పాటు చేయాలని అమాలి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక తహసిల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీలకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్న అమలు చేయడం లేదని విమర్శించారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలి రేట్లు కూడా పెంచడం లేదని వారికి భద్రత సౌకర్యం కల్పించడం లేదని ప్రమాదాలకు గురైతా ఉన్నారు వారిని పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టో విషయాన్ని వెంటనే అమలు చేసి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా 55 సంవత్సరాలు నిండిన అమాలి కార్మికులకు 6000 రూపాయల వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమాలి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జర్నీ జంగయ్య బుడిగ వెంకటేశం గాడిపెల్లి నరసింహ రాములు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా స్వాతంత్ర్య దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- ఏర్పాట్లను పరిశీలించిన మెదక్ ఆర్డీవో రమాదేవి

**మెదక్, ఆగస్టు 13:** ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అధికారులను ఆదేశించారు.గురువారం మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. వేడుకలు నిర్వహించే ప్రదేశాన్ని సందర్శించి వేదిక, పరేడ్, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ నవీన్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, పోలీస్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

## అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

**మంచిర్యాల, ఆగస్టు 12:** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు, మెరుగైన వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. కన్నెపల్లిలో విద్యార్థులకు రూ.1.80 లక్షల విలువైన సైకిళ్లు, కుట్టుమిషన్ పంపిణీ చేశారు. నెన్నెల మండలం నందులపల్లిలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

# ఉగాండా మహిళను స్వదేశానికి పంపించిన హెచ్-న్యూ



**హైదరాబాద్, ఆగస్టు 13 ::** వీసా గడువు ముగిసినప్పటికీ భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న ఉగాండాకు చెందిన నబాంజ్జా షారోన్ (36)ను హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులు స్వదేశానికి పంపించారు. టోలిచౌకి పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా, 2019 మే 4నే టూరిస్ట్ వీసా గడువు ముగిసినట్లు గుర్తించారు. డ్రగ్ పెడ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఎఫ్ఆర్ఆర్‌వో సహకారంతో ఎగ్జిట్ పర్మిట్ పొందిన అధికారులు ఆమెను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చి ఆగస్టు 12న ఉగాండాకు పంపించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే 8712661601కు తెలియజేయాలని హెచ్-న్యూ కోరింది.

# వాన నీటిని ఒడిసిపడదాం.. భూగర్భ జలాలను పెంచుదాం

## మోతినగర్ లో జలమండలి అవగాహన ర్యాలీ



**హైదరాబాద్, ఆగస్టు 13 ::** వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించాలనే లక్ష్యంతో హైదరాబాద్ జ లమండలి ఆధ్వర్యంలో మోతినగర్‌లో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. 'ఇంటింటికో ఇంకుడు గుంత' లక్ష్యంగా ప్రజలకు వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు.జలమండలి సాంకేతిక మార్గదర్శకత్వంలో మోతినగర్‌లో సుమారు 200 అడుగుల లోతుతో రెండు ఇంజెక్షన్ బావులను ఏర్పాటు చేసి, పైకప్పుల నుంచి వచ్చే వర్షపు నీటిని వాటిలోకి మళ్లించే ఏర్పాట్లు చేశారు. కాలనీలో 80 శాతం ఇళ్లలో రూఫ్‌టాప్ వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.జలమండలి 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నగరంలోని ఎండిపోయిన, నిరుపయోగ బోరుబావులను ఇంజెక్షన్ బావులుగా మార్చి భూగర్భ జలాల రీచార్జ్‌కు వినియోగించనున్నట్లు సైబరాబాద్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ తెలిపారు. ప్రతి కాలనీ వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# 200 మంది విద్యార్థులకు ఉచిత కోచింగ్




**మంథని, ఆగస్టు 13:** తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నీట్-2027 ప్రవేశ పరీక్షకు ఉచిత లాంగ్‌టర్మ్ శిక్షణ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాళేశ్వరం జోన్ ఆఫీసర్ శారద తెలిపారు.బాలురకు హైదరాబాద్ సీఓఈ పాఠశాలలో, బాలికలకు మహీంద్రా హిల్స్ సీఓఈ పాఠశాలలో శిక్షణ అందించనున్నారు. బాలురు 100 మంది, బాలికలు 100 మంది చొప్పున మొత్తం 200 మందికి ఉచిత కోచింగ్ కల్పించనున్నట్లు పెద్దపల్లి జిల్లా డీసీఓ, మంథని ప్రిన్సిపల్ శ్రీనాథ్ తెలిపారు.2026 విద్యా సంవత్సరంలో బైపీసీ ఉత్తీర్ణులై, నీట్-2026 పరీక్షకు హాజరైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆగస్టు 28 దరఖాస్తులకు చివరి తేదీ కాగా, ఎలాంటి దరఖాస్తు రుసుము లేదు. అర్హులు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలను పరిశీలించి, అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తును సమీప డీసీఓ కేంద్రంలో సమర్పించాలని సూచించారు.

# హాస్టళ్లలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత

- **పరిశుభ్రత, ఆరోగ్యం, ఆహారం, తాగునీటిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.**
- **జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.**



**నారాయణపేట, ఆగస్టు,13:** నారాయణపేట జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లాలోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీ పై ఆయా వసతి గృహాల ప్రిన్సిపల్స్, ప్రత్యేక అధికారులు, వార్డెన్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఇటీవల జిల్లాలోని ఎక్లాస్ పూర్ పాఠశాలలో జరిగిన పాము కాటు ఘటనను దృష్టిలో ఉంచుకుని హాస్టళ్ల పరిసరాల్లో పొదలు, చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, గదులు, నేలలు, గోడల్లోని రంధ్రాలను వెంటనే మూసివేయాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డీ-వాటరింగ్ చేపట్టి నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బాలికల హాస్టళ్లలో ఆర్ బీ ఎస్ కె బృందాల ద్వారా ఆరోగ్య పరీక్షలు, అనీమియా స్క్రీనింగ్ పూర్తి చేసి, విద్యార్థుల ఆరోగ్య వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా అవసరమైతే వెంటనే సమీప ఆసుపత్రికి తరలించాలని తెలిపారు.బాలికల హాస్టళ్లలో అనుమతి లేని వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించి, సందర్శకుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఆహార నాణ్యత, తాగునీరు, భవనాల నిర్వహణ, విద్యార్థుల భద్రతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.అవసరమైన చోట్ల సీ ఎస్ ఆర్ నిధులతో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు గురుకుల విద్యార్థులకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చోట్ల కొత్త ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు, పనిచేయని ఆర్వో ప్లాంట్ల మరమ్మతులకు సీ ఎస్ ఆర్ ద్వారా ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు.

### ఖాళీ సీట్లను వెంటనే భర్తీ చేయాలి

జిల్లాలోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో ఉన్న ఖాళీ సీట్లను నిబంధనల ప్రకారం వెంటనే భర్తీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్టల్ వారీగా, తరగతి వారీగా ఖాళీల వివరాలను సిద్ధం చేసి, కలెక్టరేట్ నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు.అర్హులైన విద్యార్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి అడ్మిషన్లు పూర్తి చేయాలని, దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అవసరమైన చోట జోనల్ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించి అప్రూవల్ తీసుకోవాలని, అయితే ఈ ప్రక్రియ వల్ల అడ్మిషన్లలో జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు.విద్యార్థులు అందుబాటులో ఉండి గురుకులాల్లో సీట్లు ఖాళీగా ఉండే పరిస్థితి రాకుండా, అందుబాటులో ఉన్న అన్ని ఖాళీలను సకాలంలో భర్తీ చేయాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఫణి కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రషీద్, తదితరులు పాల్గొన్నారు.

# నీతి నిజాయితీ తో పని చేయాలి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.




**నారాయణపేట, ఆగస్టు,13:** నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయంలోనీ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది. జిల్లాలోని అన్ని సర్కిల్స్, పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులు, దర్యాప్తు నాణ్యత, నేరల నియంత్రణ పై చర్యలు తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలుఅందించాలి అని ఎస్పి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, పోలీస్ అధికారులంతా నీతి నిజాయితీ తో, బాధ్యతగా పని చేయాలని సూచించారు. వీధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, విసబుల్ పోలీసింగ్ విధులు నిర్వర్తించాలని తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమరవాణా, గుట్కా, మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా పరిధిలో దాబాలలో అక్రమ మద్యం అమ్మిన, సిట్టింగ్స్ నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు, అవి నిరంతరం పనిచేసే విధంగా మానిటర్ చేయాలని సూచించారు. దొంగతనల కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి లాంగ్ పెండింగ్ కేసులలోని నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. ప్రజలు సైబర్ నేరానికి గురైతే తప్పకుండా కేసు నమోదు చేయాలని మరియు వాటి బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్),వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా పరిధిలో మండల కేంద్రాల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అలాగే ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను రాష్ గా నడుపుతూ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని సూచించారు. మన గ్రామం మన పోలీస్ కార్యక్రమంలో భాగంగా విలేజ్ పోలీసు అధికారులు గ్రామలలో పర్యటిస్తూ అన్ని గ్రామాలలో పోలీసు వాల్ ఏర్పాటు చేసే విధంగా చూడాలని తెలిపారు. పోలీసులు ప్రజలతో మమేకమవుతూ సామాజిక అంశాల పై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా పోలీస్ వ్యవస్థ పటిష్టతపై దృష్టి సారించాలనీ, ప్రతి అధికారి తాను బాధ్యత వహిస్తున్న ప్రాంతంలో నేరాలు జరగకుండా కృషి చేయాలని తెలిపారు. రానున్న గణేష్ పండుగ నేపథ్యంలో ముందస్తు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### జూలై నెలలో ఉత్తమ పనితీరు కనబరిచిన 33 మంది పోలీసులకు ప్రశంసా పత్రాలు అందించిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.

విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో విశేష కృషి చేసిన 33 మంది పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్, IPS ప్రశంసా పత్రాలు అందజేశారు.నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జూలై నెల నేర సమీక్ష సమావేశం సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన పోలీసు సిబ్బందిని గుర్తించి ఈ ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది తమ విధులను నీతి, నిజాయితీ, అంకితభావంతో నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా పోలీసు శాఖలో మరింత ఉత్సాహం, బాధ్యత పెరుగుతుందని అన్నారు.జూలై నెలలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, క్లూస్ సేకరణ తదితర విభాగాల్లో మంచి పనితీరు కనబరిచిన సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు.ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో యాదయ్య PC-1191, అరవింద్ PC-3500, అనిల్ PC-3225, భీమ్షప్ప PC-3067, జీబా WPC-3438, జహంగీర్ షా PC-2683, కె. రాము PC-3414, ఈ. మల్లేష్ గౌడ్ PC-3720, నందిని WPC-3425, నరసింహ HC-244, రామకృష్ణ HC-1874, రాజేందర్ PC-781, జి. అరుణ్ PC-3421, వెంకుగోపాల్ PC-2681, భానుప్రకాశ్ PC-3117, బి. ఆనంద్ PC-3318, సుధాచంద్ర చారి PC-3415, సుదర్శన్ గౌడ్ 597, అబ్దుల్లా PC-411, సురేందర్ గౌడ్ HC-1856, మహేష్ PC-3287, శివ ప్రసాద్ PC-1779, ఎస్. రమేష్ PC-3060, గోప్యా నాయక్ HC-3598, ఎన్. అశోక్ కుమార్ PC-3727, డి. శ్రీదేవి WHC-1993, రవి కుమార్ ARPC-1363, బాల్ రాజ్ PC-2393, షశిదర్ గౌడ్ PC-3411, బి. తిరుపతి రెడ్డి AR PC-3457,ఎస్సై బి. కృష్ణ చైతన్య ట్రాఫిక్ . ఎన్. నరేష్ కుమార్ PC-1593, కె. బాలరాజ్ HC-161 ఉన్నారు.జిల్లా పోలీసు సిబ్బంది ప్రజా భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, భవిష్యత్తులో కూడా ఉత్తమ పనితీరు కనబరిచి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఈ సమావేశంలో డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, సీఐ లు రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు ఎస్సైలు వెంకటేశ్వర్లు, నరేష్, విజయ్ కుమార్,ఎస్.ఎం నవీద్, రాజు, రమేష్,అశోక్ బాబు, మహేశ్వరి, గాయత్రి, రేవతి, భాగ్య లక్ష్మీ రెడ్డి, పురుషోత్తం, శ్రీనివాసులు, విజయ్ భాస్కర్,బాలరాజు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

# కోస్గిలో పెట్రోల్ బంక్, సోలార్ యూనిట్ ఏర్పాటు వేగవంతం చేయాలి

- **రెండు వారాల్లో అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలి.**
- **జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.**



**నారాయణపేట, ఆగస్టు,13:** జిల్లాలోని కోస్గి పట్టణంలో పెట్రోల్ బంక్, సోలార్ యూనిట్ ఏర్పాటుకు గుర్తించిన ఐదు ఎకరాల భూమికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, రెండు వారాల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో డీఆర్డీఏ, మెప్మా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో డీఆర్డీఏ, మెప్మా ఆధ్వర్యంలో భూమిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు డీఆర్డీఏ, మెప్మా మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని, కోస్గి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోలార్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనులను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.అలాగే స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో జిల్లాలో గోదాములు, వేరుశెనగ నూనె తయారీ యూనిట్లు, రైస్ మిల్లులు తదితర ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటుకు ఎస్ఈఆర్పీ సీఈఓ మంజూరులు కల్పించినట్లు అధికారులు తెలిపారు.గోదాముల ఏర్పాటుకు రూ.30 లక్షలు మంజూరయ్యాయని, దామరగిద్ద, మాగనూరు మండలాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలపగా, భూమి గుర్తింపు, కేటాయింపులో ఉన్న సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించి, నెల రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని డీఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. వీటితో పాటు జిల్లా మహిళా సమాఖ్య (జెడ్ఎంఎస్) ఆధ్వర్యంలో 'నారాయణపేట లూమ్స్' ఈ-కామర్స్ వేదిక ద్వారా నారాయణపేట పత్తి, పట్టు చీరలను దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేసి, విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.చీరల సేకరణ, వ్యాపార లావాదేవీల కోసం జెడ్ఎంఎస్ పేరుతో ప్రత్యేక బ్యాంకు ఖాతా ప్రారంభించి, అందులో రూ.5 లక్షలు జమ చేయాలని సమావేశంలో నిర్ణయించారు.నేత కార్మికులకు అధునాతన డిజైన్లపై శిక్షణ అందించేందుకు తమిళనాడుకు చెందిన నేత మాస్టర్ల సహకారం తీసుకోవాలని, శిక్షణకు ఆసక్తి, అర్హత ఉన్న నేత కార్మికులను గుర్తించాలని అధికారులను ఆమె ఆదేశించారు.నారాయణపేట చీరల బ్రాండింగ్, డిజైన్ అభివృద్ధి, నాణ్యమైన సేకరణ, మార్కెటింగ్, ప్రచారం మరింత బలోపేతం చేయాలని సూచించారు. చీరలకు ప్రత్యేక బ్రాండ్ గుర్తింపు కల్పించి దేశవ్యాప్తంగా మార్కెటింగ్‌ను విస్తరించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో వెంకట్ రాములు, సివిల్ సప్లై అధికారి బాల్ రాజ్, డీపీఎం లు మాసన్న, జయన్న, మున్సిపల్ కమిషనర్ శంకర్, ఆస్పరేషన్ బ్లాక్ సమన్వయ కర్త బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



చురకలు



# బాల్య వివాహ రహిత జిల్లాగా నారాయణపేటను తీర్చిదిద్దాలి

- బాల్య వివాహాల నివారణలో మత పెద్దల పాత్ర కీలకం
- బాల్య వివాహాలకు సహకరించకుండా స్పష్టంగా 'నో' చెప్పాలి.
- సమాచారం అందిస్తే తక్షణ చర్యలు.
- జిల్లా కలెక్టర్ ప్రియాంక.






**నారాయణపేట, ఆగస్టు,13:** నారాయణపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. శ్రావణ మాసంలో వివాహ ముహూర్తాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పూజారులు, పాస్టర్లు, ఖ్వాజీలకు బాల్య వివాహాల నిర్మూలనపై ఇక్కడి సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహం ఒక సామాజిక రుగ్మత మాత్రమే కాకుండా చట్టవిరుద్ధమైన చర్య అని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండని బాలికకు వివాహం చేయడం వల్ల ఆమె విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు.

### మత పెద్దల పాత్ర కీలకం

పూజారులు, మౌలానాలు, పాస్టర్లు, ఖాజీలు వివాహ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారని, సమాజంలో వారి మాటకు ఎంతో గౌరవం, విశ్వాసం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. బాల్య వివాహం నిర్వహించేందుకు ఎవరైనా సంప్రదించినప్పుడు, వివాహానికి అనుమతి ఇవ్వకుండా "ఇది సరైన వయసు కాదు.. వివాహాన్ని వాయిదా వేయండి" అని స్పష్టంగా చెప్పాలని కోరారు.తమ పరిధిలో బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని మత పెద్దలకు సూచించారు.

### చట్టంపై విస్తృత అవగాహన

జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే సర్పంచులు, చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.మక్తల్, కొడంగల్, కోస్గి తదితర ప్రాంతాల్లో కూడా బాల్య వివాహాల నివారణపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### కారణాలు చూపడం సమర్థనీయం కాదు

కుటుంబ ఒత్తిడి, ప్రేమ వ్యవహారం, సామాజిక పరిస్థితులు తదితర కారణాలను బాల్య వివాహాలకు చూపుతున్నప్పటికీ, ఏ కారణం కూడా చట్టాన్ని ఉల్లంఘించడానికి సమర్థన కాదని కలెక్టర్ స్పష్టం చేశారు.బాల్య వివాహాల వల్ల బాలికలు చిన్న వయసులోనే గర్భధారణ, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. చదువు మధ్యలోనే ఆగిపోయి భవిష్యత్తులో విద్య, ఉపాధి అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.ఇటీవల కోటకొండ పీహెచ్‌సీ సందర్శన సందర్భంగా కవలలకు గర్భవతిగా ఉన్న యువతిని గుర్తించి, తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న ఆమెకు వెంటనే వైద్య సేవలు అందించి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించిన విషయాన్ని కలెక్టర్ ప్రస్తావించారు.బాలికలకు చిన్న వయసులో వివాహం చేయడం వల్ల వారి విద్య, ఉపాధి, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని కలెక్టర్ అన్నారు."ఒక బాలికకు బాల్యం కావాలి.. చదువు కావాలి.. ఆరోగ్యం కావాలి.. తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే అవకాశం కావాలి" అని పేర్కొన్నారు.బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.సమాచారం అందిస్తే తక్షణ చర్యలు జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత తహసీల్దార్, సీడీపీఓ లేదా చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు.వయస్సు ధృవీకరణ పత్రాలు, ఆధార్ తదితర వివరాలపై అనుమానాలు ఉన్నప్పుడు వెంటనే అధికారులను సంప్రదించాలని తెలిపారు.బాల్య వివాహాల విషయంలో ఎవరైనా ఒత్తిడి తీసుకువచ్చినా, ఎలాంటి రాజకీయ లేదా ఇతర జోక్యాలకు తలొగ్గకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.శ్రావణ మాసంలో జిల్లాలో జరిగే వివాహాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, సీడీపీఓల ద్వారా వివాహాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, అనుమానాస్పద సందర్భాల్లో తక్షణమే పరిశీలన చేపట్టాలని ఆదేశించారు.రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రతినిధులతో మరోసారి సమావేశం నిర్వహించి బాల్య వివాహాల నివారణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించనున్నట్లు తెలిపారు."బాల్య వివాహాలకు స్వస్తి – బాలికల భవిష్యత్తుకు భరోసా – బాల్య వివాహ రహిత నారాయణపేట జిల్లా" అనే లక్ష్యంతో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

### బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు సహకరించాలి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్.

నారాయణపేట జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు పూజారులు, పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, మత పెద్దలు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పిలుపునిచ్చారు.వివాహం ఒక పవిత్రమైన కార్యక్రమమని, అయితే బాల్య వివాహం మాత్రం చట్టవిరుద్ధమైనదని స్పష్టం చేశారు. కాలానుగుణంగా సమాజంలో మార్పులు వస్తున్నాయని, ప్రస్తుతం బాలల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.బాల్య వివాహాల కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోవడంతో పాటు రక్తహీనత, చిన్న వయసులో గర్భధారణ, ప్రసవ సమయంలో సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.ఒక బాలికకు 18 సంవత్సరాలు పూర్తయ్యే వరకు తల్లిదండ్రులు ఆమెకు సంరక్షకులుగా ఉండి, చదువు, ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు.వివాహ ముహూర్తం నిర్ణయించే సమయంలో జాతకం, గుణమేళనం వంటి అంశాలను ఏ విధంగా పరిశీలిస్తారో, అదే విధంగా వధూవరుల వయస్సును కూడా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని పూజారులు, పురోహితులు, మత పెద్దలను ఎస్పీ కోరారు.18 సంవత్సరాలు పూర్తికాని బాలిక వివాహానికి అంగీకరించకూడదని, వయస్సుపై అనుమానం ఉంటే వివాహాన్ని నిర్వహించకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఆధార్ లేదా ఇతర ధృవపత్రాల్లో అనుమానాస్పద వివరాలు ఉన్నా, తప్పుడు ధృవపత్రాలు సమర్పించినా వాటిని ఆధారంగా చేసుకుని వివాహం నిర్వహించకుండా పోలీస్ అధికారులు, సీడీపీఓలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.బాల్య వివాహాన్ని నిర్వహించే వ్యక్తులు కూడా చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని, బాల్య వివాహ నిషేధ చట్టంలోని నిబంధనలను ప్రతి పూజారి, పురోహితుడు, ఖాజీ, పాస్టర్, మత పెద్ద తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు.తల్లిదండ్రులు, బంధువులు లేదా ఇతరుల నుంచి బాల్య వివాహం నిర్వహించాలనే ఒత్తిడి వచ్చినప్పుడు, "18 సంవత్సరాలు పూర్తికాకుండా వివాహం నిర్వహించడం చట్టవిరుద్ధం" అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేసి, చట్టాన్ని రక్షణగా ఉపయోగించుకోవాలని సూచించారు.సమాజంలో పూజారులు, పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, మత పెద్దలకు ప్రజల్లో ప్రత్యేకమైన గౌరవం, విశ్వాసం ఉందని, వారి మాటలను ప్రజలు శ్రద్ధగా వింటారని ఎస్పీ తెలిపారు. అందువల్ల వివాహానికి వచ్చే తల్లిదండ్రులకు బాలిక విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు ప్రాధాన్యతను వివరించి, బాల్య వివాహల నిరోధంలో వారు ముందుండాలని కోరారు."శీఘ్రమే పుత్రప్రాప్తిరస్తు" అనే దీవెనతో పాటు "విద్యా ప్రాప్తిరస్తు, ఉద్యోగ ప్రాప్తిరస్తు" అని ఆశీర్వదించాలని ఎస్పీ సూచించారు.బాలికలకు కేవలం వివాహమే జీవిత లక్ష్యంగా కాకుండా విద్య, ఉద్యోగం, స్వయం సమృద్ధి, మంచి భవిష్యత్తు లక్ష్యాలుగా ఉండేలా సమాజం ప్రోత్సహించాలన్నారు.బాల్య వివాహం జరుగుతోందని తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వయస్సుపై అనుమానం ఉన్న సందర్భాల్లో స్వయంగా నిర్ణయం తీసుకోకుండా పోలీస్ శాఖ, సీడీపీఓ లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి నారాయణపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం" అని ఎస్పీ పిలుపునిచ్చారు."బాలికకు మంచి విద్య అందాలి.. మంచి ఉద్యోగం రావాలి.. తన కాళ్లపై తాను నిలబడాలి.. అదే మనందరి ఆశీర్వాదం కావాలి" అని పేర్కొన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కు అవగాహన కల్పిస్తూ ముద్రించిన బ్రోచర్లను ఎస్పీ తో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీపీఆర్ఓ ఎం.ఏ. రషీద్, డీసీపీఓ కరిష్మా, చైల్డ్‌లైన్ తిరుపతయ్య, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గోడు వినాలి.. ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలి

- అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి... ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు.. తక్షణమే పరిష్కరించాలి
- ప్రజల సమస్యలే ప్రథమ ప్రాధాన్యం.. అధికారులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం



**వరంగల్, ఆగస్టు 13 : :** ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సూచించారు.గురువారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలపై వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, సంబంధిత అధికారులు, కాలనీ అధ్యక్షులతో కలిసి మున్సిపల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు, స్థానికులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్ల కొరత, స్మశానవాటికల వద్ద నీటి సౌకర్యం తదితర సమస్యలను వివరించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తేనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఓపికగా విని, పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు.ఈ సమావేశంలో 14వ డివిజన్ అధ్యక్షుడు ఇంతియాజ్, వివిధ కాలనీల అధ్యక్షులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగు పడి మృతి చెందిన కుటుంబానికి గ్రామ సర్పంచ్ ఆర్థిక సహాయం

**బొంరస్ పేట మండలం, ఆగస్టు,13:** వికారాబాద్ జిల్లా బొంరాస్ పేట మండల పరిధిలోని టేకులగడ్డ తండాలో పిడుగు పడి బుజ్జిబాయి అకాల మృతి చెందడంతో విషాదంలో ఉన్న మృతురాలి భర్త దీపా నాయక్,మరియు పిల్లలకు గ్రామ సర్పంచ్ లక్ష్మీ రాజు పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.5,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీ రాజు మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కుటుంబ సభ్యులకు భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.మృతురాలి కుమారుడు, కుమార్తె టేకులగడ్డ తండా పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న నేపథ్యంలో, వారి విద్యాభ్యాసానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరారం గోపాల్ ఇప్పటికే సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు దూరమైన రెవిన్యూ కార్యాలయం...

- పాత కార్యాలయ స్థలంలో నూతన భవనం నిర్మించాలి... బాల్నే జగన్
- పాత భవనం శిథిలం.. కొత్త భవనం కోసం ప్రజల ఎదురుచూపులు
- సర్టిఫికెట్ కోసం రెండు కిలోమీటర్లు...ప్రజల చెంతకు రెవిన్యూ సేవలు తీసుకురావాలి



**నర్సంపేట, ఆగస్టు 13 : :** పట్టణ నడిబొడ్డున ఉన్న పాత రెవిన్యూ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి బాల్నే జగన్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పాత రెవిన్యూ కార్యాలయ స్థలంలోనే వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం పాత రెవిన్యూ కార్యాలయం వద్ద బాల్నే జగన్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పాత భవనం ప్రమాదకరంగా మారడంతో ఏడాది క్రితం తహసీల్దార్ కార్యాలయాన్ని గ్రెయిన్ మార్కెట్‌కు తరలించారని తెలిపారు. దీంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర రెవిన్యూ సేవల కోసం ప్రజలు సుమారు రెండు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు.ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు సరైన రవాణా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయం దూరంగా ఉండటంతో ఇప్పటికీ పలువురు ప్రజలకు కార్యాలయం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నర్సంపేట పట్టణ నడిబొడ్డున అన్ని ఆధునిక సౌకర్యాలతో నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మించి, ప్రజలకు మెరుగైన రెవిన్యూ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని బాల్నే జగన్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ–మన్ కీ బాత్ కార్యదర్శి కొంపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్ లు అందజేసిన-11వార్డు కౌన్సిలర్ బత్తుల అనిత నరసింహ




**కొడంగల్ మున్సిపల్, ఆగస్టు,13:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్ట పరిచే దిశగా అడుగులు వేస్తున్నారు.అందులో భాగంగా గురువారం విద్యార్థులకు 11వ వార్డు కౌన్సిలర్ బత్తుల అనిత నరసింహ చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫామ్ లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, అంగన్వాడీ టీచర్, రాములమ్మ, పాల్గొన్నారు.

# కష్టకాలంలో అండగా.. ఆప్తులను పరామర్శించిన ఎమ్మెల్యే 'నాయిని'

- గాయపడిన లింగారెడ్డికి పరామర్శ.. మాతృవియోగంతో బాధలో ఉన్న యాదగిరి కుటుంబానికి సానుభూతి



**కాజీపేట, ఆగస్టు 13 : :** కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే మానవత్వానికి నిదర్శనమని చాటుతూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం కాజీపేట 62వ డివిజన్ పరిధిలోని సోమిడిలో పర్యటించి పలువురిని పరామర్శించారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు లింగారెడ్డి నివాసానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అనంతరం సోమిడి గౌడ సంఘం అధ్యక్షుడు గొల్లకొండ యాదగిరి తల్లి కౌసల్య ఇటీవల మృతి చెందడంతో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కౌసల్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, బాధలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెప్పడం తన బాధ్యతగా భావిస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# సామాజిక సంస్కర్త గోపరాజు లవణం

## నేడు గోపరాజు లవణం వర్ధంతి

జి. లవణం లేదా లవణంగా సుపరిచితులు అయిన గోపరాజు రామచంద్ర లవణం (10 అక్టోబర్ 1930 – 14 ఆగష్టు 2015)... గోరా గా ప్రసిద్ధి చెందిన గోపరాజు రామచంద్ర రావుకు లవణం పెద్ద కుమారుడు. ఉప్పు సత్యాగ్రహం సాగుతున్న కాలంలో పుట్టిన ఆయనకు లవణం అని పేరు పెట్టారు. తొమ్మిది మంది సంతానం కాగా, గోరా తన కుమారులకు వారు పుట్టినప్పటి ప్రపంచ, దేశ పరిస్థితులకు అద్దం పడుతూ విలక్షణమైన పేర్లు పెట్టాడు. ఉప్పు సత్యాగ్రహం సాగుతున్న కాలంలో పుట్టిన కుమారునికి లవణం అని, భారతీయులు ఛట్ట సభల్లో నిలిచి గెలిచిన కాలంలో పుట్టిన కొడుక్కు విజయం: అని, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పుట్టిన కుమారులకు సమరం, నియంత అని, తొమ్మిదవ సంతానానికి నవ్ అని పేర్లు పెట్టారు. గాంధీ ఇర్విన్ ఒడంబడిక సందర్భంలో పుట్టిన అమ్మాయికి మైత్రి అని, మరో కుమార్తె పేరు మనోరమ అని పెట్టారు. లవణం తండ్రి బాటలో నడిచాడు. లవణం భారతీయ సామాజిక సంస్కర్త. గాంధేయవాది, హేతువాది. ఆయన భారతీయ సమాజంలోని అంటరానితనాన్ని తొలగించడానికి పని చేశాడు. ఆయన నాస్తికుడు. ఆయన సతీమణి హేమలత లవణంతో కలిసి సంస్కార్ సంస్థను స్థాపించారు. నాస్తికమార్గం పత్రికల సంపాదకుడుగా పని చేసాడు. లవణం చిన్నతనం లోనే స్వాతంత్ర్యోద్య మంలో పాల్గొన్నాడు. 1973లో విజయవాడ హేతువాద సంఘ అధ్యక్షుడిగా నియమితుడు అయినాడు. అస్పృశ్యతా నిర్మూలన కుల నిర్మూలన కోసం కృషిచేశాడు. నవయుగ కవి చక్రవర్తి, పద్మ విభూషణ్ గుర్రం జాషువా యొక్క కుమార్తె హేమలతను మహాత్మా గాంధీ ఆశ్రమంలో వివాహం చేసుకున్నాడు. గాంధేయ విలువలకు కట్టుబడి సామాజిక అభ్యున్నతికి అంకితమై పని చేశాడు. మహాత్మాగాంధీ వ్యక్తిత్వం, వినోబా భావేల ప్రభావంతో, నిరాడంబరంగా ఎలా జీవించాలో వారి నుంచే నేర్చుకున్నాడు. సామాజిక జాగృతికి అనేక విధాల కృషి చేస్తున్న లవణం హేతువాదం, నాస్తిక వాదంపై అనేక గ్రంథాలు రచించాడు. సంఘం, ది ఎథీస్ట్, నాస్తిక మార్గం పత్రికలు లవణం సంపాదకీయంలో వెలువడ్డాయి. భారత నాస్తిక కేంద్రం డైరెక్టర్ గా వ్యవహరించాడు. సమాజంలో వేళ్లూనుకున్న మూఢ విశ్వాసాలు, మత మౌఢ్యానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నడిపాడు. హేమలత, లవణం దంపతులు గొప్ప సంఘ సంస్కర్తలు. సంస్కార్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, నిజామాబాద్ జిల్లాలో జోగిని వ్యవస్థను రూపుమాపేందుకు కంకణం కట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో ఉంటూ జిల్లాలో ఎన్నో గ్రామాలను దత్తత తీసుకుని, అనేక సంఘసేవా, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలో ఉన్న ‘జోగినీ’ దురాచార వ్యవస్థను, ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించి, ప్రజలను చైతన్య పరచి, దురాచారాలను పూర్తిగా నిర్మూలించ గలిగారు. “ప్లాన్ ఇంటర్నేషనల్” వారి ఆర్థిక సాయంతో అనేక గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ మార్ని రామకృష్ణారావు సలహా మేరకు అక్బర్ నగర్ గ్రామంలో గ్రామస్థుల సహాయంతో ప్రకృతి ఆశ్రమాన్ని 1997 లో ప్రారంభించడం జరిగింది. అయితే 2006 లో సంస్థతో చేసుకున్న 9 సంవత్సరాల అగ్రిమెంట్ పూర్తి అయిపోవడం వల్ల వచ్చే రోగులు ఇచ్చే ఆదాయంతో ఆశ్రమం నిర్వహించడం కష్టం అయింది. పల్లెటూరు అవడం, మరియు 5,10 కి మించి రోగులు రాకపోవడం వల్ల ఆశ్రమ నిర్వహణ కష్టమయింది. ఆ సమయంలో లవణం దంపతులు, మార్ని రామకృష్ణారావును కలసి మంతెన సత్యనారాయణ రాజుకు ఆ ప్రకృతి ఆశ్రమం ఉచితంగా 33 సంవత్సరాల లీజు అగ్రిమెంటుతో అప్పగించడం జరిగింది. అలా సంస్కార్ ప్రకృతి ఆశ్రమం అతి తక్కువ ఫీజులతో భారత దేశంలో మరెక్కడాలేనంత తక్కువ ధరలలో వైద్యసేవలందింస్తోంది. నాస్తికత్వం – అభివృద్ధి– చరిత్ర 1978, కోవూర్ జీవితం 1980 తదితర రచనలు చేశాడు. నేను నాస్తికుడిని, దేవుని నమ్మను. పూజించను. ఇతరులు ఎంతోమంది నమ్ముతారు. పూజిస్తారు. ఒకరి భావాలు మరొకరికి నచ్చవు. కొందరు నన్ను వ్యతిరేకిస్తారు. ఇంకొందరు ముఖం మీదనే తిడతారు. అయినా నేను వారి పట్ల ద్వేష భావం పెంచుకోను. పోట్లాటకు, వాదనలకు దిగను నేను స్వతహాగా హాస్య ప్రియుడిని, ఎప్పుడూ సరదాగా ఉండాలనుకునే మనస్తత్వం నాది అని తరుచూ చెపుతుండే వాడు. 1991లో అంతర్జాతీయ నాస్తికత్వాన్ని 1980 నుండి 1990 వరకు ప్రోత్సహించి నందుకు లాస్ ఏంజిల్స్ లోని నాస్తికుల యునైటెడ్ నుండి నాస్తికుడు అవార్డు, 2009లో డీనోటిఫైడ్ తెగల సభ్యులకు పునరావాసం మరియు ఉపాధి అవకాశాలను అందించి నందుకు జమ్నాలాల్ బజాజ్ అవార్డు, 2011లో ప్రపంచ శాంతికి మరియు మానవత్వానికి సేవ చేసినందుకు వైష్ణవ సెంటర్ ఫర్ ఎన్లైట్మెంట్తో అనుబంధంగా ఉన్న ఇంటర్నేషనల్ సర్వీస్ సొసైటీ నుండి లైఫ్ఎమ్ అచీవ్ మెంట్ అవార్డు, 2015లో మానవ హక్కులు మరియు సామాజిక సంస్కరణలను ప్రోత్సహించడానికి ఆయన చేసిన కృషికి హైదరాబాద్ లోని ప్రోబ్ రిసోర్స్ సెంటర్ ఫర్ జర్నలిస్ట్ నుండి అంతర్జాతీయ హ్యూమనిస్ట్ అవార్డు తదితరాలు ఆయనకు లభించాయి. కొంత కాలం ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతూ, 2015, ఆగష్టు 14న విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494


# రక్తసిక్తమైన సరిహద్దులు

## భారత విభజన పూర్వాపరాలు, చారిత్రక విశ్లేషణ

**1947 దేశ విభజన: వలస పాలన నుండి విభజిత ఉపఖండం వరకు - ఒక సమగ్ర అధ్యయనం**





భారతదేశ చరిత్రలో 1947 ఆగష్టు 15వ తేదీ ఒకవైపు శతాబ్దాల పారతంత్ర పరిమోచనకు, స్వరాజ్య ఆవిర్భావానికి ప్రాతిపదికగా నిలిస్తే, మరొకవైపు కోట్లాది మంది గుండెల్లో శాశ్వత గాయాన్ని మిగిల్చిన తీవ్ర విషాదానికి వేదికైంది. భిన్న మతాలు, భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు శతాబ్దాలుగా సహజీవనం చేసిన ప్రాచీన భరతఖండం, రాజకీయ నిర్ణయాలు మరియు మత రాజకీయాల ఫలితంగా భారత్, పాకిస్థాన్ అనే రెండు వేర్వేరు సార్వభౌమ రాజ్యాలుగా చీలిపోయింది. స్వాతంత్ర్యోదయం సంబరాలను తెస్తే, విభజన ప్రక్రియ లక్షలాది కుటుంబాల జీవితాలను క్షణాల్లో ధ్వంసం చేసింది. అందుకే భారత విభజనను కేవలం రెండు సరిహద్దుల రేఖల మార్పుగా కాకుండా వలస పాలనలోని వ్యూహాలు, నాయకత్వ వైఫల్యాలు, అధికార పోరాటాలు, తీవ్ర సామాజిక భయాలు కలగలిసి రూపుదిద్దుకున్న సంక్లిష్ట మానవ విపత్తుగా విశ్లేషించాల్సి ఉంటుంది.

ఈ విభజన బీజాలు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో, తదనంతరం 1858లో బ్రిటిష్ కిరీట పాలన ప్రత్యక్షంగా ప్రారంభమైన తరుణంలోనే పడ్డాయి. 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో హిందూ–ముస్లింలు కలసికట్టుగా పోరాడటాన్ని చూసి భయపడిన ఆంగ్లేయ పాలకులు, తమ సామ్రాజ్య పునాదులను పటిష్టం చేసుకోవడానికి ‘విభజించి పాలించు’ (ఐఱఙఱంవ ఖఅఎ =బశ్రీవ) విధానాన్ని ప్రధాన ఆయుధంగా మలుచుకున్నారు. 1905 నాటి బెంగాల్ విభజన దీనికి తొలి ఉదాహరణ కాగా, 1906లో అఖిల భారత ముస్లిం లీగ్ ఆవిర్భావం ఈ పరిణామాలకు మరింత వేగాన్ని ఇచ్చింది. ఆపై 1909 నాటి మింటో–మార్లే సంస్కరణలు ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను (రావజుఖతీవ జుశ్రీవష్శీతీవం) కేటాయించడం ద్వారా మత ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యాన్ని అధికారికంగా సంస్థాగతీకరించాయి. ఇది భారతీయ సమాజంలో మతపరమైన వేర్పాటువాద ఆలోచనలకు బీజం వేసింది.

కాలక్రమేణా ముస్లిం లీగ్ ప్రత్యేక మత రాజకీయ ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. 1930లో అలహాబాద్‌లో జరిగిన ముస్లిం లీగ్ సమావేశంలో ప్రముఖ కవి, తత్త్వవేత్త అల్లామా మహమ్మద్ ఇక్బాల్ వాయువ్య ముస్లిం మెజారిటీ ప్రాంతాలకు ప్రత్యేక రాజకీయ వ్యవస్థ ఉండాలనే ఆలోచనను తొలిసారిగా ప్రతిపాదించారు. 1933లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ విద్యార్థి చౌధరి రహ్మత్ అలీ ‘పాకిస్థాన్’ (పంజాబ్, ఆఫ్ఘనిస్థాన్, కాశ్మీర్, సింధ్, బలూచిస్థాన్ ల సంక్షిప్త రూపం) అనే నామకరణాన్ని ప్రచారంలోకి తెచ్చారు. మహమ్మద్ అలీ జిన్నా నాయకత్వంలో ముస్లిం లీగ్ ‘ద్విజాతి సిద్ధాంతాన్ని’ (ఢషీ-చీఐశీఅ ఎష్ట్రవశీతీఎ) తీవ్రంగా ప్రచారం చేసింది. హిందువులు, ముస్లింలు కేవలం వేర్వేరు మతాలకు చెందినవారు మాత్రమే కాకుండా, వారి సంస్కృతి, సామాజిక విలువలు, జీవన విధానాలు పూర్తిగా భిన్నమైనవని, కాబట్టి వారు ఒకే దేశంగా మనుగడ సాగించలేరని జిన్నా వాదించారు. 1940 మార్చి 23న లాహోర్ సమావేశంలో ముస్లిం లీగ్ చేసిన ‘లాహోర్ తీర్మానం’ ప్రత్యేక పాకిస్థాన్ డిమాండ్‌కు అధికారిక పునాదిగా మారింది.

రెండవ ప్రపంచ యుద్ధం తదనంతర పరిణామాలు అధికార మార్పిడిని అనివార్యం చేశాయి. 1942 నాటి క్రిప్స్ రాయబారం, 1945 నాటి సిమ్లా సదస్సు, 1946 నాటి క్యాబినెట్ మిషన్ వంటివి భారత ఐక్యతను కాపాడుతూ అధికార బదిలీకి మార్గాలు అన్వేషించాయి. క్యాబినెట్ మిషన్ కేంద్రానికి పరిమిత అధికారాలు ఇస్తూ, రాష్ట్రాలను మూడు గ్రూపులుగా విభజించే సమాఖ్య నమూనాను ప్రతిపాదించింది. ప్రారంభంలో కాంగ్రెస్, ముస్లిం లీగ్ దీనికి సూత్రప్రాయంగా అంగీకరించినా, కేంద్ర ప్రభుత్వం యొక్క అధికార పరిధి మరియు రాష్ట్రాల ప్రాధాన్యతలపై జవహర్‌లాల్ నెహ్రూ, జిన్నాల మధ్య కుదరని ఏకాభిప్రాయం వల్ల ఈ ప్రణాళిక విఫలమైంది.

క్యాబినెట్ మిషన్ వైఫల్యంతో తీవ్ర నిరాశకు గురైన జిన్నా, 1946 ఆగష్టు 16ను ‘ప్రత్యక్ష కార్యాచరణ దినం’గా (ఐఱతీవష్ ఆష్ఱశీఅ ఖుఎ) ప్రకటించారు. ఇది కలకత్తాలో భయానక మతకల్లోలాలకు దారితీసింది. ‘గ్రేట్ కలకత్తా కిల్లింగ్స్’గా చరిత్రలో నిలిచిన ఈ హింసలో కొద్ది రోజుల్లోనే వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మతచిచ్చు త్వరలోనే తూర్పు బెంగాల్‌లోని నోయాఖలి, బిహార్, పంజాబ్, రావల్పిండి ప్రాంతాలకు దావానలంలా వ్యాపించింది. గ్రామాలకు గ్రామాలు తగలబడిపోయాయి. ఈ రక్తపాతం సమాజంలో పరస్పర విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీసింది, విభజన తప్ప వేరే మార్గం లేదనే వాతావరణాన్ని సృష్టించింది.

పరిస్థితి చేయిదాటిపోతుండటంతో బ్రిటిష్ ప్రధాని క్లెమెంట్ అట్లీ 1947 ఫిబ్రవరి 20న పార్లమెంట్‌లో మాట్లాడుతూ, 1948 జూన్ లోపు ఆంగ్లేయులు భారతదేశాన్ని వదిలివెళ్తారని, అధికార బదిలీ పూర్తి చేస్తారని ప్రకటించారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చివరి వైస్రాయ్‌గా వచ్చిన లార్డ్ మౌంట్‌బాటన్ ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. 1947 జూన్ 3న ‘మౌంట్‌బాటన్ ప్రణాళిక’ విడుదల కాగా, బ్రిటిష్ పార్లమెంట్ ‘భారత స్వాతంత్ర్య చట్టం 1947’ను ఆమోదించింది. దీంతో భారత్, పాకిస్థాన్ అనే రెండు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన దేశాల ఆవిర్భావానికి చట్టబద్ధత లభించింది.

అయితే సరిహద్దుల నిర్దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన చారిత్రక పొరపాటు మానవాళికి తీరని శోకాన్ని మిగిల్చింది. బ్రిటిష్ న్యాయవాది సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌కు పంజాబ్, బెంగాల్ రాష్ట్రాల విభజన బాధ్యతను అప్పగించారు. భారతదేశ భౌగోళిక, సాంస్కృతిక, జనాభా సంక్లిష్టతలపై ఎటువంటి ప్రాథమిక అవగాహన లేని రాడ్‌క్లిఫ్, కేవలం పాత జనాభా లెక్కల ఆధారంగా నదులు, కాలువలు, గ్రామాలు, చివరకు ఇళ్లను కూడా రెండుగా విభజిస్తూ సరిహద్దు రేఖను గీశారు. అత్యంత దారుణమైన విషయమేమిటంటే, ఈ సరిహద్దు వివరాలను ఆగష్టు 15న కాకుండా, స్వాతంత్ర్యం వచ్చిన రెండు రోజుల తర్వాత, అంటే 1947 ఆగష్టు 17న ప్రకటించారు. తాము ఏ దేశంలో ఉన్నామో తెలియక లక్షలాది మంది ప్రజలు తీవ్రమైన అనిశ్చితికి, భయాందోళనలకు గురయ్యారు.



1947 ఆగష్టు 14న పాకిస్థాన్, ఆగష్టు 15న భారతదేశం అవతరించాయి. కానీ సరిహద్దుల ప్రకటన వెలువడగానే ప్రపంచ మానవ చరిత్రలోనే అతిపెద్ద బలవంతపు జనాభా మార్పిడి (ఘీంఎ వీఱ-ప్రతీఞఅశీఅ) సంభవించింది. తమ శతాబ్దాల నాటి ఆస్తులను, ఇళ్లను, పూర్వీకుల జ్ఞాపకాలను వదిలేసి హిందువులు, సిక్కులు భారత్‌కు, ముస్లింలు పాకిస్థాన్‌కు కాలినడకన, ఎడ్ల బండ్లపై, కిక్కిరిసిన రైళ్లలో ప్రయాణించారు. దాదాపు 1.4 కోట్ల నుంచి 1.6 కోట్ల మంది ప్రజలు తమ పురిటిగడ్డను వదిలి అభయారణ్యం కోసం సరిహద్దులు దాటారు. ఈ వలసల బాటలో చెలరేగిన మత హింసలో 5 లక్షల నుంచి 10 లక్షల మంది దారుణంగా హత్యకు గురయ్యారు. వేలాది మంది మహిళలపై లైంగిక దాడులు, అపహరణలు జరిగాయి. పంజాబ్, బెంగాల్‌లలో ప్రవహించిన నదులు, ప్రయాణించిన రైళ్లు శవాల దిబ్బలుగా మారాయి.

విభజన అనంతర పరిణామాలు నవభారతానికి, నూతన పాకిస్థాన్‌కు తీవ్ర సవాళ్లను విసిరాయి. ఢిల్లీ, అమృత్‌సర్, లాహోర్, కలకత్తా, కరాచీ వంటి నగరాలు లక్షలాది మంది శరణార్థులతో నిండిపోయాయి. పునరావాసం కల్పించడం స్వతంత్ర భారత ప్రభుత్వానికి తొలి ప్రధాన పరీక్షగా మారింది. ఆస్తుల పంపిణీ, సైనిక బలగాల విభజన, నదీ జలాల పంపిణీ వంటి ఆర్థిక పరిపరిణామాలతో పాటు, ప్రిన్స్లీ స్టేట్స్ (సంస్థానాలు) విలీనం సరికొత్త వివాదాలకు దారితీసింది. ముఖ్యంగా జమ్మూ–కాశ్మీర్ సంస్థానం భారత్‌లో విలీనమైన క్రమంలో 1947లో సంభవించిన మొదటి ఇండో–పాక్ యుద్ధం ఇరు దేశాల మధ్య శాశ్వత శత్రుత్వానికి పునాది వేసింది.

ఈ సమగ్ర విశ్లేషణ ద్వారా తేలేదేమిటంటే, భారత విభజన అనేది కేవలం ఒక వ్యక్తి లేదా ఒక రాజకీయ పార్టీ నిర్ణయం కాదు. ఇది బ్రిటిష్ వలస పాలనా వ్యూహాలు, శతాబ్దాల సహజీవనంలో చోటుచేసుకున్న మత రాజకీయాల విద్వేషాలు, కాంగ్రెస్–ముస్లిం లీగ్‌ల మధ్య పవర్ షేరింగ్ వైఫల్యాలు, అధికారాన్ని త్వరగా బదిలీ చేయాలనే బ్రిటిష్ వారి తొందరపాటుల సమ్మేళనం. మహాత్మా గాంధీ అంతిమ ఘడియ వరకు దేశ ఐక్యత కోసం, మత సామరస్యం కోసం శ్రమించినప్పటికీ, రగులుతున్న హింసాజ్వాలల ముందు ఆ ప్రయత్నాలు నెరవేరలేకపోయాయి. నెహ్రూ, పటేల్, జిన్నా వంటి నేతలు ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా తీవ్రమైన రాజీ మార్గాలను ఎంచుకోవాల్సి వచ్చింది.

“దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్” అన్న గురజాడ అప్పారావు అమృత వాక్కులు విభజన విషాదాన్ని అర్థం చేసుకోవడానికి నేటికీ దిక్సూచిగా నిలుస్తాయి. రాజకీయనాయకులు గీసిన భౌగోళిక సరిహద్దులు భూభాగాన్ని విడదీయగలిగాయి గానీ, శతాబ్దాలుగా ప్రజల మధ్య అల్లుకున్న సంస్కృతి, సాహిత్యం, భాష, ఆహారపు అలవాట్లు, సంగీతం, ఉమ్మడి జ్ఞాపకాలను వేరు చేయలేకపోయాయి. విభజన అనేది మత విద్వేషం, తీవ్రవాద ధోరణులు మానవ సమాజానికి ఎంతటి విపత్తును తెచ్చిపెడతాయో తెలియజెప్పే ఒక నిరంతర పాఠం. గతాన్ని నిందించడం కాకుండా, చరిత్రలోని లోటుపాట్లను అర్థం చేసుకుంటూ, జాతి రక్షణకు, సామాజిక ఐక్యతకు, లౌకిక విలువల పరిరక్షణకు కట్టుబడి ఉండటమే ఆ విభజన బాధితులకు మనం ఇచ్చే నిజమైన నివాళి.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తొలి టెస్ట్‌లో స్నీకో వివాదంపై దుమారం






ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో స్నీకో వివాదం తీవ్ర దుమారం రేపింది. టెక్నాలజీ సాయంతో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ప్రస్తుతం ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం డార్విన్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్ తొలి రోజు ఆటలో బంగ్లాదేశ్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బంగ్లాదేశ్ యువ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. స్టీవ్ స్మిత్ (109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. అయితే ఇన్నింగ్స్ ఆరంభంలోనే అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. టెక్నాలజీ సాయంతో బచాయించాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 21వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎబాడోట్ హొస్సేన్ వేసిన ఈ ఓవర్ నాలుగో బంతి స్టీవ్ స్మిత్ బ్యాట్‌కు దగ్గరగా వెళ్తూ కీపర్ చేతిలో పడింది. దాంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు వికెట్ కోసం అప్పీల్ చేశారు. స్మిత్ కూడా ఔటేనని భావించి పెవిలియన్ వైపు నడిచాడు. కానీ అంపైర్ కుమార్ ధర్మసేన ఔటివ్వకపోవడంతో బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో బంతి బ్యాట్‌కు తాకినట్లు స్పైక్ కనిపించలేదు. దాంతో స్మిత్ తిరిగి బ్యాటింగ్ చేపట్టాడు. అయితే ఈ నిర్ణయం తీవ్ర వివాదాస్పదమైంది. టెక్నాలజీలో లోపం ఉందని నెటిజన్లు ఆరోపించారు. ఆస్ట్రేలియా ఛీటింగ్ చేసిందని మండిపడ్డారు. తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో ఈ ఘటనపై స్మిత్ స్పందించాడు. తాను ఔటనే భావించానని, కానీ బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదన్నాడు. 'నేను ఔటయ్యాననే భావించాను. నేను చాలా అదృష్టవంతుడిని. టెక్నాలజీనే నన్ను కాపాడింది. ఒకవేళ అంపైర్ ఔటిచ్చి ఉంటే నేను వెళ్లిపోయేవాడిని. కొన్నిసార్లు ఇలా జరుగుతుంటుంది. అయితే బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయాన్ని నేను కచ్చితంగా చెప్పలేను. కానీ బ్యాట్‌కు తాకినట్లు నాకు అనిపించింది.'అని స్మిత్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హొస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజులో తంజిద్ హసన్(32 బ్యాటింగ్), మోమినుల్ హక్(35 బ్యాటింగ్) ఉన్నారు.

# శ్రీలంక పర్యటనలో పడిక్కల్ చెలరేగుతాడు




## మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం

శ్రీలంక పర్యటనలో టీమిండియా యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ చెలరేగుతాడని మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం చెప్పాడు. శ్రీలంక కండిషన్స్ అతని బ్యాటింగ్ శైలికి సరిగ్గా సరిపోతాయని తెలిపాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారం గాలే వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌లో దేవదత్ పడిక్కల్ మూడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. సాయి సుదర్శన్ గాయంతో ఈ పర్యటనకు దూరమవడంతో పడిక్కల్‌కు మార్గం సుగుమమైంది. అంతేకాకుండా వామప్ మ్యాచ్‌లో అతను అద్భుతమైన శతకంతో చెలరేగాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన రహానే.. పడిక్కల్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాడు. టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ గురించి ఆలోచించకుండా.. టెస్ట్ సిరీస్‌పై ఫోకస్ పెట్టాలని సూచించాడు. శ్రీలంక జట్టును ఏ మాత్రం తక్కువ అంచనా వేయకూడదని హెచ్చరించాడు. 'శ్రీలంక కండిషన్స్ దేవదత్ పడిక్కల్‌కు సరిగ్గా సరిపోతాయి. అతను మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు కాబట్టి.. ఆరంభంలో కాస్త జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. ఒకసారి క్రీజులో కుదురుకున్న తర్వాత స్పిన్ బౌలింగ్‌ను అతను సమర్థవంతంగా ఎదుర్కోగలడు. ఫ్రంట్ ఫుట్, బ్యాక్ ఫుట్ షాట్స్‌తో అతని వద్ద పూర్తి స్థాయి బ్యాటింగ్ నైపుణ్యాలు ఉన్నాయి. అయితే మూడో స్థానంలో ఆడే బ్యాటర్ ముందు చూపుతో ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ మూడో స్థానం బ్యాటర్ రాణిస్తే.. జట్టు మొత్తం ఆధిపత్యం చెలాయించగలదు. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ అతను మంచి రిథమ్‌లో కనిపిస్తున్నాడు. అతను తన ఫామ్, రిథమ్ నమ్ముకొని ఆడాలి. తనపై తాను అనవసర ఒత్తిడి పెంచుకోకుండా ఉండటం ముఖ్యం. అతనికి పరుగులు ఎలా చేయాలో తెలుసు. స్పిన్నర్లపై కట్, స్వీప్, స్టెప్ ఔట్ షాట్స్‌తో ఎదురుదాడి చేయగలడు.'అని రహానే చెప్పుకొచ్చాడు. భారత్ డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్ గురించి ఆలోచించి శ్రీలంకను తేలికగా తీసుకోకూడదని రహానే హెచ్చరించాడు. 'డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌ను దృష్టిలో పెట్టుకొని శ్రీలంకను తేలికగా తీసుకోకూడదు. భారత్ ముందుగా తొలి టెస్ట్ గెలవడంపై ఫోకస్ పెట్టాలి. ఆ తర్వాతే రెండో టెస్టు గెలిచి 2-0తో సిరీస్ క్లీన్ స్వీప్ చేయడం గురించి ఆలోచించాలి. కీలకమైన క్షణాలను గుర్తించి ఆధిపత్యం చెలాయిస్తేనే సిరీస్ కైవసం అవుతుంది. ఈ సిరీస్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ఎందుకంటే టెస్ట్‌ల్లో బాగా రాణించాలనే కసితో శ్రీలంక కూడా ఉంది. ఈ సిరీస్ ఏ మాత్రం ఏకపక్షంగా ఉండదని నేను భావిస్తున్నా.'అని అజింక్యా రహానే అన్నాడు.

# కేఎల్ రాహుల్ మా ఎక్స్‌ఫ్యాక్టర్..

## టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్



శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సన్నద్ధమైంది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. ఈ క్రమంలో ఈ సిరీస్‌ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. అయితే ఈ సిరీస్‌లో వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ తమ ఎక్స్‌ఫ్యాక్టర్ అని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. తొలి టెస్ట్ నేపథ్యంలో మోర్కెల్ గురువారం మీడియాతో మాట్లాడాడు. ప్రస్తుత భారత జట్టు బ్యాటింగ్ లైనప్‌లో కేఎల్ రాహుల్‌కు మాత్రమే శ్రీలంకలో ఆడిన అనుభవం ఉందని, అది జట్టుకు ఉపయోగపడుతుందని తెలిపాడు.'టెస్ట్‌ల్లో కేఎల్ రాహుల్ గత కొన్నేళ్లుగా భారత బ్యాటింగ్ విభాగాన్ని నడిపిస్తున్న తీరు అద్భుతం. శ్రీలంక కండీషన్స్, పిచ్‌లపై అతనికి అపారమైన అనుభవం ఉంది. అతనికి ఉన్న ఈ అనుభవం యువ ఆటగాళ్లకు ప్రాక్టీస్ సెషన్స్‌లో ఎంతగానో ఉపయోగపడింది. అదేవిధంగా గత కొన్ని నెలలుగా మా ప్లేయర్స్ వ్యక్తిగతంగా తమ ఆటను ఎంతో మెరుగుపరుచుకున్నారు. ఈ సిరీస్‌ను గెలవడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేశాం. ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు 10 రోజుల ముందే ఇక్కడికి వచ్చాం.'అని మోర్నీ మోర్కెల్ చెప్పుకొచ్చాడు. తొలి టెస్ట్‌లో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉందని మోర్నీ మోర్కెల్ తెలిపాడు. గాలె పిచ్ కండిషన్స్ పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఓవైపు నుంచి భారత స్పిన్ దళం అటాక్ చేస్తే.. మరో వైపు నుంచి పేసర్లు ఒత్తిడి తీసుకు రాగలరని తెలిపాడు. 'గాలే పిచ్ చూడటానికి మంచి వికెట్‌లా కనిపిస్తోంది. కానీ మ్యాచ్ సాగేకొద్దీ పిచ్‌లో మార్పు ఉంటుందని నేను అనుకుంటున్నా. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే విధంగా మేం సిద్ధమయ్యాం. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి మాకు కావాల్సింది మానసిక బలం, బ్యాటింగ్‌లో సమయం, బౌలింగ్ స్పెల్స్ వేయడం, బంతిని సరైన ప్రదేశంలో వేయడం వంటివి.'అని ఇయాన్ మోర్గాన్ చెప్పుకొచ్చాడు. బ్యాటింగ్ పరంగా టీమిండియా బలంగానే ఉన్నా.. బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా దూరమవ్వడం పెద్ద లోటు కాగా.. జట్టులో ఉన్న ఆటగాళ్లంతా శ్రీలంక పర్యటనకు కొత్త కావడం మరో విశేషం. కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాకు మినహా శ్రీలంక పర్యటనలో టెస్ట్ సిరీస్ ఆడిన అనుభవం మరే ఆటగాడికి లేకపోవడం గమనార్హం.



# గంభీర్‌కు అండగా నిలిచిన హర్భజన్ సింగ్

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అండగా నిలిచాడు. టీమిండియా వైఫల్యానికి గంభీర్‌ను బాధ్యుడిని చేస్తూ అతనిపై విమర్శలు గుప్పించడం సరికాదని అభిప్రాయపడ్డాడు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషని, అందుకే అతన్ని నిర్ణయాలు నచ్చడం లేదని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. గంభీర్ కోచింగ్‌లో భారత జట్టు ఐసీసీ టోర్నీలు గెలిచిందని గుర్తు చేశాడు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. శనివారం నుంచి గాలే వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. అయితే గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెస్ట్‌ల్లో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. ఈ క్రమంలోనే అతని కోచింగ్ తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. శ్రీలంకతో సిరీస్‌కు ముందు మాట్లాడిన హర్భజన్ సింగ్.. గంభీర్‌ను వెనకేసుకొచ్చాడు. 'గౌతమ్ గంభీర్ ఎందుకు ఇంతలా ఎందుకు విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే అతన్ని నిదించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు. గంభీర్ క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచి నాకు తెలుసు. ఆట పట్ల చాలా నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ ఆరంభంలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతనికి మంచి ఫ్రెండ్స్. ఇప్పటికీ వారే స్నేహితులనుకుంటా. అతను ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడుతాడు. అందుకే అతని నిర్ణయాలు కొందరికి నచ్చవు. కవర్ చూసి పుస్తకం ఎలాంటిదో చెప్పకూడదని పెద్దలు అంటారు. గంభీర్‌ను విమర్శించడం కూడా తప్పే. గెలుపు కోసమే ఆడాలని నమ్మే కోచ్ అతను. ఓటమిని ఏ మాత్రం జీర్ణించుకోడు. డ్రా కోసం ఆడేందుకు అస్సలు ఇష్టపడడు. శుభ్‌మన్ గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. అతను గొప్ప ఆటగాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా బ్యాటర్‌గా సత్తా చాటాడు. ఫుట్‌బాల్‌లో లియెనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఆడుతున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో ఆడితే తప్పేంటి? ఏ ఆటగాడికైనా సరే ప్రదర్శనే కొలమానం. వయసు ముఖ్యం కాదు. విరాట్ కోహ్లీ 37 ఏళ్ల వయసులోనూ 20 ఏళ్ల కుర్రాడిలా మైదానంలో చురుకుగా ఉంటాడు. భారత జట్టులో కోహ్లీ.. మెస్సీ లాంటి ప్లేయర్. భారత జట్టులో ఫిట్‌నెస్ విప్లవం తెచ్చింది అతనే. చివరి రోజు 400 పరుగుల లక్ష్యం ఉన్నా సరే విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ మెరుగ్గా రాణిస్తున్నారు. కాబట్టి వారిని వన్డేల్లో కొనసాగించాలి.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.



# భారత్‌తో టెస్ట్‌కు శ్రీలంక జట్టు ప్రకటన

రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగే టెస్ట్ టీమ్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ధనంజయ డిసిల్వా సారథ్యంలోని 16 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను బుధవారం వెల్లడించింది. కమిందు మెండిస్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సీనియర్లతో పాటు ఇటీవల టీమిండియా వామప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న పలువురు ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. వెటరన్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్‌వెల్లా సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ముగ్గురు అనామక ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. సీనియర్ బ్యాటర్ కుశాల్ మెండీస్ తొడ కండరాల గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. మణికట్టు సర్జరీతో పాతుమ్ నిస్సంక సేవలను శ్రీలంక కోల్పోయింది. దాంతోనే 33 ఏళ్ల నిరోషన్ డిక్‌వెల్లాకు పిలుపు దక్కింది. 2023లో శ్రీలంక తరఫున అతను చివరి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. స్పిన్‌కు అనుకూలంగా ఉండే గాలే మైదానంలో బలమైన భారత బౌలింగ్ యూనిట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్‌కు అతని చేరిక బలాన్ని చేకూర్చనుంది. ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ కేశర నువంత, బ్యాటర్ పాసిందు సూర్య బండారా, సోనా దినుషా తొలిసారి శ్రీలంక టెస్ట్ టీమ్ పిలుపును అందుకున్నారు. ఇటీవల భారత్‌తో జరిగిన వామప్ మ్యాచ్‌లో నువాంత మూడు వికెట్లు తీసాడు. భారత్-ఏ జరిగిన అనధికారిక టెస్ట్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. దాంతో అతనికి శ్రీలంక జట్టులో చోటు దక్కింది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది.

### భారత్‌తో తొలి టెస్ట్‌కు శ్రీలంక టీమ్:

ధనంజయ డి సిల్వా (కెప్టెన్), కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), లహిరు ఉదార, నిషాన్ మదుష్క, దినేష్ చండిమల్, పసిందు సూర్యబండార, సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా (వికెట్), రమేష్ మెండిస్, ప్రబాత్ జయసూర్య, కేశర నువంత, మిలన్ ద్రువాల్నాండో, ఎఫ్‌సి ధృవాల్నాండో, ఎఫ్. మధుశంక.

చురకలు





# సుకుమార్ కూతురు సుకృతివేణికి బోస్టన్ స్కూల్ స్కాలర్‌షిప్

'పుష్ప' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందారు సుకుమార్. ఇటీవల జాతీయ అవార్డుల్లో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగానూ ఘనత సాధించారు. ఆయన తనయ సుకృతి వేణి కూడా విభిన్న బాటలో పయనిస్తున్నారు. 2024 సంవత్సరానికి జాతీయ ఉత్తమ బాల నటిగా 'గాంధీ తాత చెట్టు'కు అవార్డు సాధించిన సుకృతి వేణి ఇప్పుడు మరో అరుదైన ఘనతను కైవసం చేసుకుంది. అమెరికాలోని 'బోస్టన్ అంతర్జాతీయ బర్క్‌లీ స్కూల్ ఆఫ్ మ్యూజిక్' సంశ్రీత విభాగంలో ఎన్‌సెంబుల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికై ఫుల్ స్కాలర్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. మొత్తం 272 మంది పిల్లలు ఆడిషన్ ఇవ్వగా, కేవలం 14 మందికి మాత్రమే పూర్తి స్కాలర్‌షిప్ వచ్చింది. అందులో సింగర్స్ విభాగంలో ఎంపికైన ఏకైక విద్యార్థిని సుకృతి వేణి కావడం విశేషం.







# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం

అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.




# అలా ..రజనీకాంత్ గారితో..



టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు, అలాగే సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.

# లోకేశ్ కనగరాజ్ చిత్రం 'డీసీ'కి పెరుగుతున్న కలెక్షన్లు

కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com